

4న జడ్పీ సర్వసభ్య సమావేశం



విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల నాలుగో తేదీన చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగుతుందని సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జిల్లాలో అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీల, గౌరవ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పర్యాటకం... ప్రచారం శూన్యం

కొత్త ప్రాజెక్టులు ప్రతిపాదనలకే పరిమితం

- నగర సందర్శకుల సమాచారమూ లేదు
- పూర్తిస్థాయి అధికారుల నియామకంపైనా నిర్లక్ష్యం
- డిప్యుటేషన్లతోనే కాలక్షేపం
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం జిల్లాలో పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నా తగిన ప్రచారం కల్పించలేకపోతున్నారు. రాష్ట్రంలో విశాఖపట్నమే ప్రధాన ఆకర్షణీయ నగరమని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా ఆ స్థాయిలో ఇక్కడి వ్యవహారాలపై దృష్టి పెట్టడం లేదు. సరైన అధికారులను నియమించడం లేదు. రాజకీయ సిఫారసుల మేరకు డిప్యుటేషన్‌పై పోస్టులను నింపుతున్నారు. పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. డివిజనల్ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. వారం క్రితం భర్తీ చేసినా ఆ అధికారి ఇంకా రాలేదు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఏటా సెప్టెంబరు 27న నిర్వహిస్తారు. దానిని ఒక ఉత్సవంలా చేయాలి. కానీ దీనిపై ఎటువంటి ప్రచారం లేదు. మమ అనిపించడానికి మొక్కుబడిగా శనివారం చిల్డ్రన్ ఎరీనాలో ఓ కార్యక్రమం ఏర్పాటుచేశారు.







నేడు అన్నింటిలోను ఉచిత ప్రవేశం

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీఎంఆర్‌డీఏ నగర ప్రజలకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. బీచ్‌రోడ్డులో మ్యూజియాలతో పాటు అన్ని పార్కులు, కైలాసగిరిపైకి ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్టు తెలిపింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

అంతా నాన్చుడు ధోరణే

రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రాజెక్టులు విశాఖపట్నం తెప్పిస్తున్నామని, స్టార్ హోటళ్లలో గదుల సంఖ్య పెంచుతున్నామని, వందల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని ప్రచారం చేస్తోంది. కానీ పర్యాటకులను ఆకర్షించే చిన్న చిన్న ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేస్తోంది. విశాఖ వచ్చే వారు తప్పనిసరిగా సముద్రంలో విహరించాలని కోరుకుంటారు. పర్యాటక శాఖకు ఓ బోటు ఉన్నా దానికి సరైన ప్రచారం లేదు. ఓ ప్రైవేటు సంస్థ చిన్నపాటి క్రూయిజ్ నడుపుతామని, అనుమతి ఇవ్వాలని ఏడాది క్రితం కోరింది. ఇప్పటివరకు దానికి మోక్షం లేదు. తెన్నేటి పార్కుకు ఐదేళ్ల క్రితం బంగ్లాదేశ్ నౌక ఎంవీ మా కొట్టుకు వచ్చింది. దానిని ... మిగతా 6వ పేజీలో

విశాఖలో చూడదగిన ప్రాంతాలు...

- ఆర్కే బీచ్, కురుసుర సబ్‌మెరైన్, టీయూ-142 మ్యూజియం, సీ హ్యారియర్ మ్యూజియం, యుహెచ్-3హెచ్ మ్యూజియం, విశాఖ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్క్, సిటీ సెంట్రల్ పార్క్, తెన్నేటి పార్క్, కైలాసగిరి, రుషికొండ బీచ్, తొట్లకొండ, భీమిలి బీచ్, ఎర్రమట్టి దిబ్బలు. యారాడ బీచ్, సాగర్ దుర్గా ఆలయం, డాల్ఫిన్ నోస్ కొండ.



ఏయూ వీసీ కార్యాలయం వద్ద విద్యార్థులను నిలువరిస్తున్న పోలీసులు

ఏయూ పాలకుల దిద్దుబాట

హెల్త్ సెంటర్‌లో ఖాళీల భర్తీకి ఆగమేఘాలపై ప్రకటన

- ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్టల నియామకానికి నిర్ణయం
- తొలి రోజు పది మందికి ఇంటర్వ్యూలు

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని హెల్త్ సెంటర్‌లో అవసరమైన సిబ్బంది లేకపోవడం వల్లనే హాస్టల్ విద్యార్థి మృతి చెందాడని విద్యార్థులు ఆరోపించడంతో యాజమాన్యం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

ఒకే ఒక వైద్యుడు ఉన్నారని, ఆయన కూడా రిటైర్డ్ అధికారి కావడంతో ఒక మెడికల్ ఆఫీసర్, వారానికి రెండు రోజులు పనిచేసేలా మరో మెడికల్ ఆఫీసర్, ఒక ఫార్మసిస్ట్, మరో స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అర్హులైనవారు శుక్ర, శనివారాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇందులో భాగంగా శుక్రవారం పది మందికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. కాంట్రాక్టు పద్ధతిపై నియమించే మెడికల్ ఆఫీసర్‌కు నెలకు రూ.40 వేల వేతనం నిర్ణయించారు. అలాగే మరో మెడికల్ ఆఫీసర్ (వారానికి రెండు రోజులు డ్యూటీ)కు రూ.20 వేలు జీతం పెట్టారు. ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్స్ పోస్టులకు రూ.10 వేలు జీతం నిర్ణయించారు. రూ.10 వేల జీతానికి స్టాఫ్‌నర్సులు ఎవరు వస్తారంటూ విద్యార్థి సంఘ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఏఎన్ఎంగా పనిచేసే వారికే ప్రైవేటు ఆస్పత్రుల్లో నెలకు రూ.15 వేలు ఇస్తున్నారని, ఏదో పేరుకు సిబ్బందిని పెట్టామనడానికి ఈ నియామకాలు చేపడుతున్నట్టు అనుమానంగా ఉందని అంటున్నారు.

అంబులెన్స్‌లో ఆక్సిజన్ ఉందట

విద్యార్థులు శుక్రవారం ఆందోళన విరమించిన తరువాత వీసీ రాజశేఖర్ విలేకరులతో మాట్లాడారు. తనపై దాడి చేసే ఉద్దేశంతో గురువారం ఛాంబర్‌లోకి విద్యార్థులు వచ్చారని ఆరోపించారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ లేదని ప్రచారం జరుగుతోందని, ... మిగతా 6వ పేజీలో

ఏయూలో రెండో రోజూ ఆందోళన

- రిజిస్ట్రార్ కార్యాలయం ముందు విద్యార్థుల బైఠాయింపు
- క్యాంపస్‌లో వైద్య సదుపాయాలపై కమిటీని నియమించిన కలెక్టర్
- వారం రోజుల్లో సమస్యలకు పరిష్కారం చూపిస్తామని వీసీ హామీ

... మెయిన్‌లో

ధైర్యలక్ష్మిగా కనకమహాలక్ష్మి



బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష తులసీ దళాలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. శనివారం అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారికి కలువ పూలతో సహస్ర నామార్చన జరుపుతారు.

-మహారాణిపేట/ఆంధ్రజ్యోతి

ముసురు

- అల్పపీడనం ప్రభావంతో వర్షాలు
- నేడు భారీవర్షసూచన

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో రెండు రోజులుగా కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా, సాయంత్రానికి వాయుగుండంగా మారింది. ఆ ప్రభావంతో జిల్లాలో ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం అన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. వాయుగుండం శనివారం ఉదయం గోపాల్‌పూర్‌కు సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో భారీవర్షాలు కురుస్తాయని తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించింది.



నగరంలో వర్షం

ఆ సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- ఏసీబీ కేసులో ఇద్దరికీ రిమాండ్

మల్కాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన ములగాడ మండల సర్వేయర్ రొంగలి సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ కర్రి నగేష్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ములగాడ మండల తహశీల్దార్ రమేష్‌నాయుడు ఇక్కడ జరిగిన ఘటన వివరాలు శనివారం కలెక్టర్‌కు నివేదించారు. ఈ మేరకు వారిని సస్పెండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు సర్వేయర్ రొంగలి సత్యనారాయణను, జూనియర్ అసిస్టెంట్ కర్రి నగేష్‌లను ఏసీబీ కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించారు.

ఆటో డ్రైవర్ హత్య

- మద్యం మత్తులో రౌడీషీటర్ ఘాతుకం

కంచరపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో రౌడీషీటర్లు చెలరేగిపోతున్నారు. అరాచకం సృష్టిస్తూ, అదేమని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత కంచరపాలెం ప్రాంతంలో ఓ రౌడీ షీటర్ మద్యం మత్తులో ఆటో డ్రైవర్‌పై దాడి చేసి హత మార్చాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కంచరపాలెం ప్రాంతంలోని తిక్కవానిపాలెంలో నివాసం ఉంటున్న నాగలి గణేష్‌కుమార్(30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు (6) ఉన్నారు. గొడవల కారణంగా ఐదు నెలల కిందట భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రస్తుతం గణేష్ ఆరేళ్ల కుమారుడితో ఉంటున్నాడు. ఇది లావుండగా గురువారం అర్ధరాత్రి దాటాక స్థానిక శివాలయం ఎదురుగా గల రైల్వే స్థలంలో రౌడీషీటర్ తరుణ్, మరో ముగ్గురు కలిసి మద్యం సేవించసాగారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వారి మధ్య వివాదం తలెత్తింది. పెద్దగా కేకలు వేసుకుంటూ గొడవ పడుతుండడంతో సమీపంలో ఉన్న గణేష్‌కుమార్ అక్కడకు వెళ్లి వారించాడు. వారిలో ఒక రితో గణేష్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఆ విషయం తెలిసి రౌడీషీటర్ ... మిగతా 6వ పేజీలో



నాగలి గణేష్ కుమార్ (ఫైల్)

చెత్త తరలింపులో లాలూచీ

సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణలో అవినీతి కంపు

- ప్రాజెక్టు నిర్వహణకు ఏటా రూ.కోట్లు కేటాయిస్తున్న జీవీఎంసీ
- అయినా మెయింటెనెన్స్‌పై కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- జీవీఎంసీ నిధులతో పనులు చేపట్టేందుకు అధికారుల ప్రతిపాదనలు!
- టౌన్‌కొత్తరోడ్డులోని ప్రాజెక్టు నిర్వహణపై కమిషనర్ ఆగ్రహం
- కాంట్రాక్టర్‌ను తొలగించాలని ఆదేశం
- అయినా అదే కాంట్రాక్టర్‌ను కొనసాగిస్తున్న అధికారులు



టౌన్‌కొత్తరోడ్డు వద్ద గల ఎంఎస్ఎఫ్‌లో పేరుకుపోయిన చెత్త

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) ప్రాజెక్టుల నిర్వహణలో భారీ అవినీతి జరుగుతోంది. జోన్‌ల పరిధిలోని చెత్త తరలింపు కేంద్రాల (ఎంఎస్ఎఫ్) నుంచి కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు చెత్తను శాస్త్రీయంగా తరలించేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చిన ఈ విధానం కొంత మంది అధికారులకు, కాంట్రాక్టర్లకు బంగారుబాతుగా మారింది.

జీవీఎంసీ పరిధిలో ప్రతిరోజూ 1,100 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే క్లాప్ వాహనాలు దానిని సంబంధిత జోన్‌లోని ఎంఎస్ఎఫ్‌లకు తరలిస్తాయి. అక్కడి నుంచి టిప్పర్లు, లారీలతో కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. లారీలు, టిప్పర్లలో చెత్తను తరలించినప్పుడు ... మిగతా 6వ పేజీలో

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

- నాలుగు వారాలపాటు కార్యక్రమాలు
- కలెక్టర్ హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నాలుగు వారాల ప్రణాళిక సిద్ధం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ వివరించారు. శుక్రవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై కార్యక్రమం ఈనెల 22న ప్రారంభమైందన్నారు. ఈనెల 25 నుంచి 29 వరకు సేవింగ్స్‌పై, 30 నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు వ్యవసాయం, ... మిగతా 6వ పేజీలో

డీఎస్సీలో మహిళలదే పైచేయి

- జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైనవారు 1,268
- మహిళలు 718, పురుషులు 550 మంది
- ఇక నియోజవర్గాల వారీగా చూస్తే నర్సీపట్నం నియోజకవర్గం నుంచి 171 మంది టీచర్లుగా ఎంపిక
- అతి తక్కువగా విశాఖ నార్త్ నుంచి నలుగురు..

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో మహిళలే అధికం. మొత్తం 1,268 మందిలో 718 మంది (56.62 శాతం) మహిళలు కాగా 550 మంది (43.33 శాతం) పురుషులు ఉన్నారు. జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా 574 మంది ఎంపిక కాగా అందులో 382 మంది మహిళలు. అలాగే ఏజెన్సీలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 335 పోస్టులకుగాను 239 మంది మహిళలు ఎంపికైనట్టు విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో వ్యాయామ, గణితం, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్‌లో మినహా మిగిలిన వాటిల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఎంపికయ్యారు. దాదాపు అన్ని కేడర్‌లలో టాప్ ర్యాంకర్లు మహిళలు కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ, మునిసిపల్, జువెనైల్, గిరిజన సంక్షేమ శాఖల్లో మొత్తం 1,139 పోస్టులకుగాను 1,134 పోస్టులు భర్తీ కాగా, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలోని గురుకులాల్లో 134 మందిని ఎంపిక చేశారు. నియోజకవర్గాల వారీగా ఎంతమంది ఎంపికయ్యారనే వివరాలను విద్యా శాఖ రూపొందించింది. అన్ని కేడర్లలో కలిసి అత్యధికంగా నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 174 అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆ తరువాత పాయకరావుపేట నియోజకవర్గం నుంచి 147 మంది, చోడవరంనుంచి 145 మంది, భీమిలి నియోజకవర్గంలో 132, మాడుగులలో 130 మంది, విశాఖపట్నం పశ్చిమ నుంచి 77 మంది, ఎలమంచిలి, అరకు నియోజకవర్గాల నుంచి 61 మంది చొప్పున, గాజువాక నుంచి 57 మంది, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల నుంచి 49 మంది చొప్పున, విశాఖపట్నం తూర్పు నుంచి ... మిగతా 6వ పేజీలో

డీఎస్సీలో మహిళలదే పైచేయి

... 5వ పేజీ తరువాయి

28 మంది, విశాఖ సౌత్ నుంచి 25 మంది, అతి తక్కువగా ఉత్తర నియోజకవర్గం నుంచి నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల నుంచి నాన్‌లోకల్ కోటాలో 93 మంది ఎంపికయ్యారు. నూతన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3 నుంచి శిక్షణ ఇస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

... 5వ పేజీ తరువాయి

అక్టోబరు 7 నుంచి 13 వరకూ విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ అక్టోబరు 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, రెన్యుబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్ అంశాలపై షాపింగ్‌మాల్ ఫెస్టివల్ నిర్వహిస్తామని వివరించారు.



పర్యాటకం... ప్రచారం పూజ్యం

... 5వ పేజీ తరువాయి

ఫ్లోటింగ్ రెస్టారెంట్‌గా మారుస్తామని నౌకను కొనుగోలు చేసిన గిల్ సంస్థ అప్పటి నుంచి కోరుతూనే ఉంది. దానికీ అనుమతి ఇవ్వలేదు. విశాఖపట్నం పోర్టు రూ.100 కోట్ల వ్యయంతో క్రూయిజ్ టెర్మినల్ నిర్మించింది. ఏడాదికి రెండుసార్లు కార్డిలియో క్రూయిజర్ తప్ప ఇంకొకటి రావడం లేదు. పర్యాటక శాఖ అధికారులు ఏమి చేస్తున్నారనేది పెద్ద ప్రశ్న.

రుషికొండ బీచ్ నిర్వహణలోనూ లోపాలే. దానికి గతంలో వచ్చిన బ్లూఫ్లాగ్ గుర్తింపు పోయేలా వ్యవహరించారు. కింద మీద పడి మళ్లీ దానిని నిలబెట్టారు. ఇప్పటికీ అది సమస్యగానే ఉంది. నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు సంస్థకు అప్పగించాలని టెండర్లు పిలిచారు. అది ప్రైవేటు చేతికి వెళ్లిపోతే ఏపీటీడీసీకి అడ్డగోలుగా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయం పోతుందని కఠిన నిబంధనలు పెట్టారు. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే జరుగుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి.

పర్యాటక సమాచారమూ శూన్యమే

విశాఖపట్నం పర్యాటక శాఖ అధికారుల వద్ద నగరానికి ఎంతమంది పర్యాటకులు వస్తున్నారు? వారిలో అంతర్జాతీయ పర్యాటకులు ఎంతమంది?, దేశీయ పర్యాటకులు ఎంతమంది?, ఏయే రాష్ట్రాల నుంచి వస్తున్నారు?...అనే కనీస సమాచారం కూడా లేదు. ఎటువంటి రికార్డులు నిర్వహించడం లేదు.

డబుల్ డెక్కర్‌కు ఆదాయం పెంచే ఆలోచన శూన్యం

నగరంలో ఇటీవలె సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా డబుల్ డెక్కర్ బస్సులు రెండింటిని ప్రారంభించారు. వాటికి టిక్కెట్ ధరలు పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100 పెట్టారు. వారాంతాలైన శని, ఆదివారాల్లో తప్పితే మిగిలిన రోజుల్లో వాటికి ఆదరణ ఉండడం లేదు. ముగ్గురు, నలుగురికి మించి ఎక్కడం లేదు. ఈ బస్సులకు ఆదాయం వచ్చేలా ఎలా ఉపయోగించుకోవాలనే ఆలోచన కూడా లేదు. ఖాళీగా ఉన్నాయని తీసుకువెళ్లి సాగర్‌నగర్‌లో ఛార్జింగ్ పాయింట్ వద్ద ఉంచేస్తున్నారు. భీమిలికి బీచ్ మార్గంలో బస్సులు తక్కువ. అటు వైపు పేరొందిన కాలేజీలు, ఐటీ సంస్థలు ఉన్నాయి. వారికైనా ఉపయోగపడేలా...కాసింత రేటు తగ్గించి రెగ్యులర్‌గా నడిపితే ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆ ఆలోచన కూడా లేదు.

వీఎంఆర్‌డీఏ వల్ల నిలబడుతున్న పరువు

వీఎంఆర్‌డీఏ వల్లనే పర్యాటక శాఖ పరువు నిలబడుతున్నదంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులు తీసుకువస్తూ పర్యాటకుల సంఖ్య పెంచేందుకు యత్నిస్తోంది. ఈ ఒక్క ఏడాదిలోనే కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్‌లైనర్ ప్రారంభించింది. అక్కడే గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది. బీచ్ రోడ్డులో యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభించింది.

వీటిపై పునరాలోచన అవసరం

చిన్న చిన్న ప్రాజెక్టులు పెడతామని ముందుకు వచ్చిన వారికి ప్రభుత్వం ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదు?, దానికి కారణాలు ఏమిటి?, ఎన్ని ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయనే దానిపై ఒకసారి సమీక్షిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయి. పర్యాటక శాఖకు ప్రచారం కూడా చాలా ముఖ్యం. దానిపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంది.

కొమ్మాది : కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. వచ్చేనెల 7 వరకు గడువు పొడిగించారని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.



ఆనందపురంలో చౌక్ బాల్ పోటీలు

ఆనందపురం : పాలవలస పంచాయతీ పరిధిలో ఉన్న అసెంట్ స్కూల్లో 16వ జాతీయ చౌక్ బాల్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు ఈ పోటీలను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి 700 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

చెత్త తరలింపులో లాలూ‘చీ’

... 5వ పేజీ తరువాయి

రోడ్లపై చెత్త జారిపడిపోవడం, గాలికి ఎగిరి రోడ్డుపై వచ్చే వారిపై పడడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతుండడంతో సీసీఎస్ ప్రాజెక్టుకు అధికారులు రూపకల్పన చేశారు. ఈ విధానంలో జోన్ స్థాయిలో ఉండే ఎంఎస్ఎఫ్ వద్దకు చెత్తను క్లాప్ వాహనాలు తీసుకువచ్చినప్పుడు ఎత్తైన బ్రిడ్జిపైకి వెళ్లి అక్కడి నుంచి ఒక గల్లాలోకి వేస్తాయి. గల్లాలో పడిన చెత్తను ప్రత్యేకమైన యంత్రం సహాయంతో ఒక కేక్ మాదిరిగా ప్రెస్‌చేసి నేరుగా ట్యాంకర్‌లోకి పడేస్తారు. తర్వాత వెనుక వైపు డోర్ వేసి బయటకు చెత్త కనిపించకుండా, వాసన రాకుండా చేస్తారు. ట్యాంకర్ ద్వారా చెత్తను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ విధానాన్ని జీవీఎంసీ పరిధిలో వన్‌టౌన్‌లోని టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఉన్న ఎంఎస్ఎఫ్‌తోపాటు గాజువాక, ముడసర్లోవ, చీమలాపల్లి ఎంఎస్ఎఫ్‌ల్లో అమలు చేస్తున్నారు.

నిర్వహణ కాంట్రాక్టర్లకు అప్పగింత

సీసీఎస్ ప్రాజెక్టులో భాగంగా ఎంఎస్ఎఫ్ వద్ద యంత్రాలను అమర్చడంతోపాటు రెండు ట్యాంకర్ లారీలను జీవీఎంసీ సమకూర్చింది. లారీలకు అవసరమైన డీజిల్‌ను జీవీఎంసీయే సమకూర్చుతుంది. డ్రైవర్లను నియమించుకుని ఆయా వాహనాలు, ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (నిర్వహణ) బాధ్యతను ఏటా టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక ఎంఎస్ఎఫ్‌ల్లోని సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణను గత ఏడాది సుమారు రూ.రెండు కోట్లకు ఒకే కాంట్రాక్టర్ దక్కించుకోగా, ముడసర్లోవ, చీమలాపల్లి సీసీఎస్‌లను దాదాపు అంతే మొత్తానికి మరో ఇద్దరు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఆయా ప్రాజెక్టులతోపాటు ట్యాంకర్ లారీల నిర్వహణ, మరమ్మతులు కూడా సంబంధిత కాంట్రాక్టరే చూసుకోవాల్సి ఉంటుంది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

సీసీఎస్ ప్రాజెక్టులను పక్కాగా నిర్వహించాల్సిన కాంట్రాక్టర్లలో ఇద్దరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టు వద్ద రెండు ట్యాంకర్ టిప్పర్లలో ఒకటి గత ఆరు నెలలుగా పనిచేయకపోవడంతో షెడ్‌లోనే ఉంది. కానీ ఆ వాహనం పేరుతో ప్రతి నెలా డీజిల్‌ను తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టును పరిశీలించిన కమిషనర్ కేతన్‌గార్గ్ అక్కడి నిర్వహణపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. చెత్త భారీగా పేరుకుపోయి ఉండడంతో ప్రాజెక్టు నిర్వహణపై ఆరా తీశారు. కాంట్రాక్టర్ సరిగా పనిచేయడం లేదని ప్రాథమికంగా గుర్తించడంతో అతడి టెండర్‌ను నిలుపుదల చేస్తూ నోటీసు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు వెంటనే నోటీసు జారీచేశారు. అయితే అదే కాంట్రాక్టర్‌తో ఇప్పటికీ పనులు కొనసాగిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇదిలావుండగా టౌన్‌కొత్తరోడ్డుతోపాటు, గాజువాకలోని సీసీఎస్ ప్రాజెక్టులో కొన్ని పరికరాలు మరమ్మతుకు గురయ్యాయి. వాటికి రూ.1.5 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టరే వెచ్చించి చెత్త తరలింపు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, జీవీఎంసీ నుంచి మంజూరు చేసేందుకు వీలుగా అధికారులు ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీనిపై మెకానికల్ విభాగం ఎస్ఈ గోవిందరావును వివరణ కోరగా టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టులో ఒక ట్యాంకర్ లారీ ఆరునెలలుగా పనిచేయడం లేదని, అయితే దానికి డీజిల్ డ్రా చేస్తున్నట్టు తనకు తెలియదన్నారు. అలాగే ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌ను తొలగించాలని కమిషనర్ నోటీసు ఇవ్వడం వాస్తవమేనని, కొత్త కాంట్రాక్టర్ ఇప్పటికిప్పుడు దొరకరు కాబట్టి, ఆయన్నే కొనసాగిస్తున్నామని చెప్పడం విశేషం. టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక ప్రాజెక్టులకు సంబంధించిన ఫైళ్లను తెప్పించుకుని పరిశీలిస్తానన్నారు.









ఏయూ పాలకుల దిద్దుబాట

... 5వ పేజీ తరువాయి

వాస్తవానికి ఆక్సిజన్ ఉందని చెప్పారు.

ఆక్సిజన్ ఎవరు పెట్టాలి?

అంబులెన్స్ ఎక్కడికైనా వెళితే.. డ్రైవర్‌తో పాటు సహాయక సిబ్బంది కనీసం ఒకరైనా ఉంటారు. వాహనాన్ని డ్రైవర్ నడిపితే, రెండో వ్యక్తి రోగికి అవసరమైన ప్రాథమిక చికిత్స చేస్తారు. వారికి ఆక్సిజన్ పెట్టడం వంటి పనులు వచ్చి ఉండాలి. అయితే ఏయూ హెల్త్ సెంటర్ అంబులెన్స్‌కు డ్రైవర్ తప్ప ఇతర సిబ్బంది లేరు. దాంతో ఆక్సిజన్ ఉన్నా దానిని పెట్టే అవకాశం లేకుండా పోయింది. వసతులు ఉన్నా వాటిని ఉపయోగించే సిబ్బంది, వారికి శిక్షణ కూడా అవసరమనే విషయం అధికారులు విస్మరించారు. ఇప్పటికైనా తూతూ మంత్రంగా కాకుండా, పూర్తిస్థాయిలో చిత్తశుద్ధితో తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



ఆటో డ్రైవర్ హత్య

... 5వ పేజీ తరువాయి

తరుణ్ కర్రతో గణేష్ తలపై గట్టిగా కొట్టాడు. దీంతో గణేష్ తీవ్ర రక్తస్రావమై కుప్పకూలిపోయి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

అడివివరం సొసైటీ మహాజన సభ రేపు

సింహాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అడివివరం సహకార పరపతి సంఘం మహాజన సభ ఆదివారం నిర్వహించనున్నట్టు పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.















జోనల్ కార్యాలయం ముట్టడి

» ప్రవేశ మార్గానికి అడ్డంగా కూర్చున్న చిరు వ్యాపారులు, సీఐటీయూ నాయకులు

» టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


జడ్సీ అయ్యప్పనాయుడు, సీఐటీయూ నాయకుడు మూర్తి మధ్య వాగ్వాదం

భీమునిపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయాన్ని తగరపువలసకు చెందిన చిరు వ్యాపారులు, సీఐటీయూ నాయకులు శుక్రవారం ముట్టడించారు. తగరపువలస ఈఎస్ఐ ఆస్పత్రి ప్రహరీని ఆనుకుని జాతీయ రహదారి వెంబడి ఉన్న 56 దుకాణాలను తొలగించిన టౌన్ ప్లానింగ్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయం 9 గంటలకు కార్యాలయానికి చేరుకున్న వారు అప్పటికే గదిలో ఉన్న ఇద్దరు ఉద్యోగులను బయటకు పంపించి, ప్రధాన ద్వారం గేట్ వేసి, అడ్డంగా బైఠాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ హరీష్, మహిళా ఎస్ఐ గౌరి ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇంతలో కార్యాలయానికి వచ్చిన జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు,సిబ్బంది లోపలకు వెళ్లకుండా బయటే ఉండిపోయారు. ఈ సందర్భంగా సీఐటీయూ భీమిలి జోన్ కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ హైవే అథారిటీకి చెందిన స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్న వారి దుకాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఏ నిబంధన ప్రకారం తొలగించారని ప్రశ్నించారు. అధికారుల తీరు వల్ల చాలా దుకాణాలు దెబ్బతిన్నాయని, వాటికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐ తిరుమలరావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం చట్టరీత్యా నేరమని, ఆందోళన విరమించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా బాధితులకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకూ కదిలే పరిస్థితి లేదని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. జడ్సీ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్. అప్పలనాయుడు, నీలాతి రాము, నరసింగరావు, ప్రసాద్‌రామ్, నాయుడు, సురేశ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.




సాయి ప్రియా బీచ్ రిసార్ట్స్‌లో దసరా ఉత్సవాలు


లలిత సహస్రనామం పఠిస్తున్న భక్తులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలోని సాయిప్రియా బీచ్ రిసార్ట్స్‌లో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. లలిత సహస్రనామ పారాయణం, శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ భజనలు, బాలపూజ, సువాసిని పూజ, చిన్నారులతో సంగీత కచేరి ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాలు భక్తులను, రిసార్ట్స్‌కు వచ్చిన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రిసార్ట్స్ ఎండీ డీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్ శంకర్ నారాయణ, రాధిక, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 28, 29, 30వ తేదీల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మహా చండీయాగం నిర్వహిస్తామని చెప్పారు.





మహాలక్ష్మీదేవిగా ..


ఎండాడలో దుర్గాలమ్మ


జీవీఎంసర్‌లో రాజరాజేశ్వరి అమ్మవారు


చంద్రంపాలెంలో దుర్గాలమ్మ


విజినిగిరిపాలెంలో కరెన్సీ నోట్లతో అలంకరణ

నియోజకవర్గంలోని పలు చోట్ల జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మానం ఆంజనేయనగర్‌లో అమ్మవారు





పార్కు ఫెన్సింగ్ తొలగింపు

సాగర్‌నగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ బీచ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న పార్కు ఫెన్సింగ్‌ను కొంతమంది లాడ్జిల నిర్వాహకులు శుక్రవారం రాత్రి జేసీబీతో తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వం పార్కులో ఈట్ స్ట్రీట్ నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేసింది. కాలనీ వాసులు అడ్డుకోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. ఈనేపథ్యంలో లాడ్జిల నిర్వాహకుల్లో కొందరు ఫెన్సింగ్ తొలగించి, స్థలాన్ని ఆక్రమిస్తున్నారు.

క్విజ్ పోటీల విజేత గీతం

సాగర్‌నగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణపై యువతకు అవగాహన కల్పించడానికి ప్రముఖ టైర్ల తయారీ సంస్థ అపోలో టైర్స్ లిమిటెడ్ కళాశాలల విద్యార్థులకు జాతీయ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. శుక్రవారం గీతం వర్సిటీ వేదికగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా గీతం, కృష్ణ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

ఇనాం భూ సమస్యను పరిష్కరించండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇనాం భూముల సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. ఆనందపురం మండలంలోని ముచ్చర్ల, శిర్లపాలెం గ్రామాలు. భీమిలిలోని నారాయణరాజుపేట, పద్మనాభంలోని బీఆర్ తాళ్లవలస తదితర ఏడు గ్రామాల్లో ఇనాం భూముల సమస్య ఉందన్నారు. రైతులు రుణాలు తెచ్చుకోవాలన్నా, అవసరాలకు భూములు అమ్ముకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇదే విషయాన్ని గత అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించగా రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరిస్తామని సంబంధిత మంత్రి చెప్పారన్నారు.

తగరపువలస : సంగివలస కొత్తమ్మతల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ నాయకుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.













శరణు భవానీ!


గాయత్రి దేవిగా వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు


శివరామకృష్ణ దేవాలయంలో మహాలక్ష్మీ అవతారంలో ఉమాదేవి


బర్మాక్యాంప్ నూకాంబిక ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


సీతమ్మధారలో రేణుక దేవిగా దుర్గాదేవి అమ్మవారు


శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వర స్వామి అలంకరణ

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఐదోరోజు శుక్రవారం గాయత్రిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, పండ్లరసాలతో కలిపి 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. సాయంత్రం మహిళలతో వాసవి కనకదుర్గకు కోటి కుంకుమార్చనలు, హోమం, మణిద్వీప వర్ణన, పారాయణం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ ఏర్పాట్లు చేశారు. శనివారం కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీబాలాజీ రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మహాలక్ష్మీ అవతారంలో ఉమాదేవి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని దేవదాయ శాఖ అజమాయిషీలో ఉన్న శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం హారతులిచ్చారు. ఆలయ ఈవో రమాబాయి పర్యవేక్షణలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి జి.మన్మథరెడ్డి, అర్చకులు భార్గవశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నూకాంబిక అమ్మవారి ఆలయంలో...

మురళీనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం 49వవార్డు బర్మాక్యాంప్ నూకాంబిక అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బుచ్చిబాబు శర్మ అమ్మవారి సన్నిధిలో పూజాదికాలు నిర్వహించి ఉత్సవ నిర్వహణ చేపట్టారు. ఆలయ ఈవో మూర్తి పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. మాధవధార సీతన్న గార్డెన్స్ కనకమహాలక్ష్మి ఆలయం, మురళీనగర్ హైస్కూలు దగ్గరి లలితాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కాలనీ, ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మాధవధార, ఉడాకాలనీ, పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో ఉత్సవ వేదికల వద్ద ప్రత్యేక దీపాలంకరణ చేపట్టారు.

రేణుకదేవిగా..

సీతమ్మధార, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల షిరిడి సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి దేవాలయంలో అమ్మవారిని రేణుకదేవిగా అలంకరించారు. అయ్యవారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అలంకరించి భక్తులకు అనుమతించారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు వేదమంత్రాలతో అభిషేకాలు, పూజలు జరిపారు.

కాన్వెంటు కూడలిలో ..


కాన్వెంట్ కూడలిలో అమ్మవారిని దర్శించుకుంటున్న స్థానిక నాయకులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాన్వెంటు కూడలిలోని జ్ఞానాపురం టోకు కాయగూరల మార్కెట్ వద్ద ఘనంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి నిత్యం కుంకుమపూజలు చేస్తున్నారు. కాన్వెంటు కూడలి వద్ద విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. అక్టోబరు 2 వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సీఎంఆర్ షాపింగ్‌మాల్ పునఃప్రారంభం


షాపింగ్‌మాల్ ప్రారంభించిన సినీనటి రితికా నాయక్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సరికొత్త హంగులతో మరింత సువిశాలంగా, వైభవంగా తీర్చిదిద్దిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ప్రముఖ సినీతార, మిరాయ్ ఫేం హీరోయిన్ రితికా నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ జడ్జికోర్టు ఎదురుగా ఉన్న షాపింగ్ మాల్‌ను కస్టమర్లను ఆకట్టుకునేలా సరికొత్త కలెక్షన్లతో నేడు పునః ప్రారంభించినట్లు తెలిపారు. 1984లో చందన బ్రదర్స్ పేరుతో, 2002లో జిల్లా కోర్టు ఎదురుగా సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత నాలుగు దశాబ్దాల్లో 4 రాష్ట్రాలలో 42 శాఖలను ప్రారంభించి విజయవంతంగా నడుపుతున్నామని తెలిపారు. కస్టమర్ల అభిరుచికి, లేటెస్టు ఫ్యాషన్సుకు తగ్గట్టుగా విస్తృతమైన వస్త్రశ్రేణితో అతి తక్కువ ధరలకు సేవలందించటమే ముఖ్యఉద్దేశమని వివరించారు. అంతేకాకుండా దసరా సందర్భంగా ప్రతీ 999 రూపాయల వస్త్రాల కొనుగోలుపై ఒక బహుమతి అందించనున్నట్లు తెలిపారు. నూతన జీఎస్టీ విధానాలకు అనుగుణంగా తగ్గింపు ధరలకు వస్త్రాలను వినియోగదారులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మావూరి మోహన బాలాజీ, నూలు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పతక విజేతకు జీవీఎంసీ కమిషనర్ అభినందన


జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసిన విజేత లింగేశ్వరరావు, కార్పొరేటర్ ఉషశ్రీ

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో రజత పతకం సాధించిన అంతర్జాతీయ షట్లర్ బీవీఎస్‌కె.లింగేశ్వరరావును శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తన కార్యాలయంలో అభినందించారు. థాయిలాండ్‌లో 192 దేశాలకు చెందిన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ టోర్నీలో భారత్ నుంచి 90 మంది షట్లర్లు ప్రాతినిధ్యం వహించారని, అయితే భారత్‌కు ఏడు పతకాలు మాత్రమే దక్కగా, వాటిలో 55 ప్లస్ మిక్స్‌డ్ డబల్స్‌లో పార్టనర్ సజన్ వింగ్లెట్‌తో కలిసి రజత పతకం సాధించిన అంశాన్ని కమిషనర్‌కు లింగేశ్వరరావు వివరించారు. అలాగే లింగేశ్వరరావు ఇప్పటి వరకు సాధించిన అంతర్జాతీయ పతకాల వివరాలను తెలుసుకున్న కమిషనర్ కేతన్‌గార్గ్ విశాఖ క్రీడా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటడం విశేషమని, వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. కార్పొరేటర్, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ ప్రధాన కార్యదర్శి ఉషశ్రీ పాల్గొన్నారు.

అక్టోబరులో జర్నలిస్టులకు వైద్య శిబిరం: కలెక్టర్

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్టోబరులో జర్నలిస్టులకు వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావుల ఆధ్వర్యంలో జర్నలిస్టులు శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ ప్రీమియాన్ని సీఎస్‌ఆర్ నిధుల నుంచి చెల్లిస్తామని, ఇప్పటికే కార్యాచరణ జరుగుతోందని తెలిపారు. ఆదేవిధంగా గుర్తింపు పొందిన ఆసుపత్రుల ద్వారా వైద్య శిబిరాలు సైతం నిర్వహిస్తామని తెలిపారు. కార్యవర్గ సభ్యులు కె.చంద్రమోహన్, డి.హరనాథ్, పరశురామ్ పాల్గొన్నారు.

జోన్-2 పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాధవధార, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ జోన్-2 పరిధి ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో శనివారం (నేడు) విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడనున్నట్లు డీఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఎయిర్‌పోర్ట్, ఎన్ఏడీ ఫీడర్‌లలో పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు. మాధవధార, మర్రిపాలెం, పార్వతీనగర్, ఎన్ఏడీ గణేష్‌నగర్, కాకానినగర్, విమాన్ నగర్, దుర్గాపురం ప్రాంతాలకు సరఫరా ఉండదు. వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

కంచరపాలెం: కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో తోటది, దుర్గానగర్, మల్లసూరి వీధి, గోకుల్‌నగర్, గౌరీ నగర్, సుభాష్‌నగర్, తమ్ముడుపాలెం తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు.

స్కానింగ్ కేంద్రాల నిశిత పరిశీలనకు కలెక్టర్ ఆదేశం


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో స్కానింగ్ చేసే వారి విద్యార్హతలు, స్కానింగ్ సెంటర్ల డాక్యుమెంట్లు పరిశీలించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావును ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లింగ నిర్ధారణ చట్టం అమలు, జిల్లా స్థాయి ఎడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రంవారు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తును పూర్తిగా పరిశీలించిన తరువాతే అనుమతులు ఇవ్వాలని సూచించారు. అన్ని ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లలో విధిగా ఐదు శాతం ఉచిత స్కాన్‌లు చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అందించాలని ఆదేశించారు. నెలలో గర్భిణులకు సంబంధించిన స్కాన్‌లలో 5 శాతం ఉచితంగా చేసిన వివరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అందించాక రెన్యువల్ రిజిస్ట్రేషన్ పొందాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల సహకారంతో డెకాయ్ ఆపరేషన్‌లు ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు వైద్యులు, వైద్యాధికారులు, ఎన్‌జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్టపరిహారం ఇప్పించండి: ఎమ్మెల్యే వంశీకృష్ణ


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే సీహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం శాసనసభలో ప్రస్తావించారు. మూడేళ్ల కిందట సముద్రంలో మునిగిపోయిన, కొన్ని కాలిపోయిన బోట్ల యజమానులకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని, గత ప్రభుత్వ తప్పిదం వల్ల పేద మత్స్యకారులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. మత్స్యశాఖ, విపత్తు శాఖల మధ్య సమన్వయలోపాన్ని ప్రస్తావించారు. రూ2.8 కోట్ల బకాయిలు త్వరగా మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు డీజిల్ సబ్సిడీని 9 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని ప్రస్తావించారు. కేజీహెచ్, ఘోషా ఆస్పత్రిలో సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.

డీఎస్సీలో మహిళలదే పైచేయి

... 5వ పేజీ తరువాయి

28 మంది, విశాఖపట్నం సౌత్ నుంచి 25 మంది, అతి తక్కువగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం నుంచి నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల నుంచి నాన్‌లోకల్ కోటాలో 93 మంది ఎంపికయ్యారు. కాగా ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకున్న వారికి వచ్చే నెల మూడో తేదీ నుంచి శిక్షణ ఇస్తామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

... 5వ పేజీ తరువాయి

ఇతర వృత్తులు, అక్టోబరు 7 నుంచి 13 వరకూ విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్, అక్టోబరు 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, రెన్యూబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్ తదితర అంశాలపై షాపింగ్‌మాల్ ఫెస్టివల్ నిర్వహిస్తామని వివరించారు.

ఏయూ పాలకుల దిద్దుబాట

... 5వ పేజీ తరువాయి

వాస్తవానికి ఆక్సిజన్ ఉందని చెప్పారు.

ఆక్సిజన్ ఎవరు పెట్టాలి?

అంబులెన్స్ ఎక్కడికైనా వెళితే.. డ్రైవర్‌తో పాటు సహాయక సిబ్బంది కనీసం ఒకరైనా ఉంటారు. వాహనాన్ని డ్రైవర్ నడిపితే, రెండో వ్యక్తి రోగికి అవసరమైన ప్రాథమిక చికిత్స చేస్తారు. వారికి ఆక్సిజన్ పెట్టడం వంటి పనులు వచ్చి ఉండాలి. అయితే ఏయూ హెల్త్ సెంటర్ అంబులెన్స్‌కు డ్రైవర్ తప్ప ఇతర సిబ్బంది లేరు. దాంతో ఆక్సిజన్ ఉన్నా దానిని పెట్టే అవకాశం లేకుండా పోయింది. వసతులు ఉన్నా వాటిని ఉపయోగించే సిబ్బంది, వారికి శిక్షణ కూడా అవసరమనే విషయం అధికారులు విస్మరించారు. ఇప్పటికైనా తూతూ మంత్రంగా కాకుండా, పూర్తిస్థాయిలో చిత్తశుద్ధితో తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆటో డ్రైవర్ హత్య

... 5వ పేజీ తరువాయి

తరుణ్ కర్రతో గణేష్ తలపై గట్టిగా కొట్టాడు. దీంతో గణేష్ తీవ్ర రక్తస్రావమై కుప్పకూలిపోయి మృతిచెందాడు. రాత్రి గస్తీ విధుల్లో ఉన్న పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మూడో లైనులో హైస్పీడ్ ట్రయిల్ రన్ విజయవంతం


బొబ్బిలి ప్రాంతంలో మూడో లైన్‌ను పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికార బృందం

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని డొంకినవలస, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం స్టేషన్లను కలుపుతూ కొత్తగా 36 కి.మీ. నిడివిలో మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణ పూర్తయిన నేపథ్యంలో రైల్వే భద్రత కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా శుక్రవారం కొత్త ట్రాక్‌పై హైస్పీడ్ ట్రయిల్ రన్ నిర్వహించారు. ట్రాక్, విద్యుదీకరణ పూర్తి కావడంతో 25టీ యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా కొత్తగా నిర్మించిన పట్టాలు, వంతెనలు, మలుపులు పరిశీలించిన తర్వాత నిర్వహించిన ట్రయిల్ రన్ విజయవంతంగా పూర్తయింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేషన్ యార్డులు, క్రాస్ ఓవర్లు, హైలెవెల్ ప్లాట్‌ఫామ్‌లు, వంతెనలను తనిఖీ చేసిన బ్రిజేష్ కుమార్ పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. అప్‌గ్రేడ్ చేసిన లైనులో స్పీడ్ ట్రయిల్ రన్ నిర్వహించిన అనంతరం రైలు ట్రాఫిక్ కార్యకలాపాలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుశ్ గుప్తా, చీఫ్ బ్రిడ్జి ఇంజనీర్ అశోక్‌కుమార్, ఆర్‌వీఎన్ఎల్ డైరక్టర్ ఎస్.కె. పాత్రో, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సముద్రంలో కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డులు


హుసేన్‌ను ఒడ్డుకు తీసుకొచ్చిన లైఫ్‌గార్డులు

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో స్నానం చేస్తూ కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న యువకుడిని లైఫ్‌గార్డులు కాపాడారు. గోపాలపట్నంకు చెందిన షేక్ హుసేన్ (21), మరో ఇద్దరితో కలిసి శుక్రవారం సాయంత్రం సరదాగా బీచ్‌కు వచ్చాడు. ఆర్కే బీచ్ వద్ద స్నానం చేసేందుకు సముద్రం లోపలకు వెళ్లాడు. అసలే అల్పపీడనం కారణంగా అలలు ఉధృతంగా రావటంతో హుసేన్ సముద్రం లోపలకు కొట్టుకుపోయాడు. అది గుర్తించిన జీవీఎంసీ లైఫ్‌గార్డులు పోలరాజు, నవీన్, రాకేష్‌లు వెంటనే లోపలకు వెళ్లి హుసేన్‌ను కాపాడారు. ఒడ్డుకు తీసుకు వచ్చి ప్రథమ చికిత్స అందించి కాపాడి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెత్త తరలింపులో లాలూచీ

... 5వ పేజీ తరువాయి

రోడ్లపై చెత్త జారిపడిపోవడం, గాలికి ఎగిరి రోడ్డుపై వచ్చేవారిపై పడడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతుండడంతో సీసీఎస్ ప్రాజెక్టుకు అధికారులు రూపకల్పన చేశారు. ఈ విధానంలో జోన్ స్థాయిలో ఉండే ఎంఎస్ఎఫ్ వద్దకు చెత్తను క్లాప్ వాహనాలు తీసుకువచ్చినప్పుడు ఎత్తైన బ్రిడ్జిపైకి వెళ్లి అక్కడి నుంచి ఒక గల్లాలోకి వేస్తాయి. గల్లాలో పడిన చెత్తను ప్రత్యేకమైన యంత్రం సహాయంతో ఒక కేక్ మాదిరిగా ప్రెస్‌చేసి నేరుగా ట్యాంకర్‌లోకి పడేస్తారు. తర్వాత వెనుక వైపు డోర్ వేసి బయటకు చెత్త కనిపించకుండా, వాసన రాకుండా చేస్తారు. ట్యాంకర్ ద్వారా చెత్తను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ విధానాన్ని జీవీఎంసీ పరిధిలో వన్‌టౌన్‌లోని టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఉన్న ఎంఎస్ఎఫ్‌తోపాటు గాజువాక, ముడసర్లోవ, చీమలాపల్లి ఎంఎస్ఎఫ్‌ల్లో అమలు చేస్తున్నారు.

నిర్వహణ కాంట్రాక్టర్లకు అప్పగింత

సీసీఎస్ ప్రాజెక్టులో భాగంగా ఎంఎస్ఎఫ్ వద్ద యంత్రాలను అమర్చడంతోపాటు రెండు ట్యాంకర్ లారీలను జీవీఎంసీ సమకూర్చింది. లారీలకు అవసరమైన డీజిల్‌ను జీవీఎంసీయే సమకూర్చుతుంది. డ్రైవర్లను నియమించుకుని ఆయా వాహనాలు, ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (నిర్వహణ) బాధ్యతను ఏటా టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక ఎంఎస్ఎఫ్‌ల్లోని సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణను గత ఏడాది సుమారు రూ.రెండు కోట్లకు ఒకే కాంట్రాక్టర్ దక్కించుకోగా, ముడసర్లోవ, చీమలాపల్లి సీసీఎస్‌లను దాదాపు అంతే మొత్తానికి మరో ఇద్దరు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఆయా ప్రాజెక్టులతోపాటు ట్యాంకర్ లారీల నిర్వహణ, మరమ్మతులు కూడా సంబంధిత కాంట్రాక్టరే చూసుకోవాల్సి ఉంటుంది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

సీసీఎస్ ప్రాజెక్టులను పక్కాగా నిర్వహించాల్సిన కాంట్రాక్టర్లలో ఇద్దరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టు వద్ద రెండు ట్యాంకర్ టిప్పర్లలో ఒకటి గత ఆరు నెలలుగా పనిచేయకపోవడంతో షెడ్‌లోనే ఉంది. కానీ ఆ వాహనం పేరుతో ప్రతి నెలా డీజిల్‌ను తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టును పరిశీలించిన కమిషనర్ కేతన్‌గార్గ్ అక్కడి నిర్వహణపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. చెత్త భారీగా పేరుకుపోయి ఉండడంతో ప్రాజెక్టు నిర్వహణపై ఆరా తీశారు. కాంట్రాక్టర్ సరిగా పనిచేయడం లేదని ప్రాథమికంగా గుర్తించడంతో అతడి టెండర్‌ను నిలుపుదల చేస్తూ నోటీసు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు వెంటనే నోటీసు జారీచేశారు. అయితే అదే కాంట్రాక్టర్‌తో ఇప్పటికీ పనులు కొనసాగిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇదిలావుండగా టౌన్‌కొత్తరోడ్డుతోపాటు, గాజువాకలోని సీసీఎస్ ప్రాజెక్టులో కొన్ని పరికరాలు మరమ్మతుకు గురయ్యాయి. వాటికి రూ.1.5 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టరే వెచ్చించి చెత్త తరలింపు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, జీవీఎంసీ నుంచి మంజూరు చేసేందుకు వీలుగా అధికారులు ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీనిపై మెకానికల్ విభాగం ఎస్ఈ గోవిందరావును వివరణ కోరగా టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టులో ఒక ట్యాంకర్ లారీ ఆరునెలలుగా పనిచేయడం లేదని, అయితే దానికి డీజిల్ డ్రా చేస్తున్నట్టు తనకు తెలియదన్నారు. అలాగే ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌ను తొలగించాలని కమిషనర్ నోటీసు ఇవ్వడం వాస్తవమేనని, కొత్త కాంట్రాక్టర్ ఇప్పటికిప్పుడు దొరకరు కాబట్టి, ఆయన్నే కొనసాగిస్తున్నామని చెప్పడం విశేషం. టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక ప్రాజెక్టులకు సంబంధించిన ఫైళ్లను తెప్పించుకుని పరిశీలిస్తానన్నారు.

పర్యాటకం... ప్రచారం పూజ్యం

... 5వ పేజీ తరువాయి

ఫ్లోటింగ్ రెస్టారెంట్‌గా మారుస్తామని నౌకను కొనుగోలు చేసిన గిల్ సంస్థ అప్పటి నుంచి కోరుతూనే ఉంది. దానికీ అనుమతి ఇవ్వలేదు. విశాఖపట్నం పోర్టు రూ.100 కోట్ల వ్యయంతో క్రూయిజ్ టెర్మినల్ నిర్మించింది. ఏడాదికి రెండుసార్లు కార్డిలియో క్రూయిజర్ తప్ప ఇంకొకటి రావడం లేదు. పర్యాటక శాఖ అధికారులు ఏమి చేస్తున్నారనేది పెద్ద ప్రశ్న.

రుషికొండ బీచ్ నిర్వహణలోనూ లోపాలే. దానికి గతంలో వచ్చిన బ్లూఫ్లాగ్ గుర్తింపు పోయేలా వ్యవహరించారు. కింద మీద పడి మళ్లీ దానిని నిలబెట్టారు. ఇప్పటికీ అది సమస్యగానే ఉంది. నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు సంస్థకు అప్పగించాలని టెండర్లు పిలిచారు. అది ప్రైవేటు చేతికి వెళ్లిపోతే ఏపీటీడీసీకి అడ్డగోలుగా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయం పోతుందని కఠిన నిబంధనలు పెట్టారు. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే జరుగుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి.

పర్యాటక సమాచారమూ శూన్యమే

విశాఖపట్నం పర్యాటక శాఖ అధికారుల వద్ద నగరానికి ఎంతమంది పర్యాటకులు వస్తున్నారు? వారిలో అంతర్జాతీయ పర్యాటకులు ఎంత మంది?, దేశీయ పర్యాటకులు ఎంతమంది?, ఏయే రాష్ట్రాల నుంచి వస్తున్నారు?...అనే కనీస సమాచారం కూడా లేదు. ఎటువంటి రికార్డులు నిర్వహించడం లేదు.

డబుల్ డెక్కర్‌కు ఆదాయం పెంచే ఆలోచన శూన్యం

నగరంలో ఇటీవలె సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా డబుల్ డెక్కర్ బస్సులు రెండింటిని ప్రారంభించారు. వాటికి టిక్కెట్ ధరలు పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100 పెట్టారు. వారాంతాలైన శని, ఆదివారాల్లో తప్పితే మిగిలిన రోజుల్లో వాటికి ఆదరణ ఉండడం లేదు. ముగ్గురు, నలుగురికి మించి ఎక్కడం లేదు. ఈ బస్సులకు ఆదాయం వచ్చేలా ఎలా ఉపయోగించుకోవాలనే ఆలోచన కూడా లేదు. ఖాళీగా ఉన్నాయని తీసుకువెళ్లి సాగర్‌నగర్‌లో ఛార్జింగ్ పాయింట్ వద్ద ఉంచేస్తున్నారు. భీమిలికి బీచ్ మార్గంలో బస్సులు తక్కువ. అటు వైపు పేరొందిన కాలేజీలు, ఐటీ సంస్థలు ఉన్నాయి. వారికైనా ఉపయోగపడేలా...కాసింత రేటు తగ్గించి రెగ్యులర్‌గా నడిపితే ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆ ఆలోచన కూడా లేదు.

వీఎంఆర్‌డీఏ వల్ల నిలబడుతున్న పరువు

వీఎంఆర్‌డీఏ వల్లనే పర్యాటక శాఖ పరువు నిలబడుతున్నదంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులు తీసుకువస్తూ పర్యాటకుల సంఖ్య పెంచేందుకు యత్నిస్తోంది. ఈ ఒక్క ఏడాదిలోనే కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్ ప్రారంభించింది. అక్కడే గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది. బీచ్ రోడ్డులో యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభించింది.

వీటిపై పునరాలోచన అవసరం

చిన్న చిన్న ప్రాజెక్టులు పెడతామని ముందుకు వచ్చిన వారికి ప్రభుత్వం ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదు?, దానికి కారణాలు ఏమిటి?, ఎన్ని ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయనే దానిపై ఒకసారి సమీక్షిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయి. పర్యాటక శాఖకు ప్రచారం కూడా చాలా ముఖ్యం. దానిపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంది.

డ్రైనేజీ పనుల జాప్యంతో ట్రాఫిక్ ఇబ్బందులు

- నెలల తరబడి సాగుతున్న నిర్మాణ పనులు
- వెంకోజీపాలెం-మద్దిలపాలెం మధ్య వాహనాల రాకపోకలకు అవస్థలు
- రద్దీ సమయం, వర్షం పడితే పరిస్థితి మరీ అధ్వానం
- అధికారుల నిర్లక్ష్యంపై నగరవాసుల అసంతృప్తి


వెంకోజీపాలెం-మద్దిలపాలెం మధ్య నిలిచిపోతున్న వాహనాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోట ప్రధాన రహదారిని ఆనుకుని పెట్రోలు బంకు వద జరుగుతున్న డ్రైనేజీ మరమ్మలు పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి పనులు సాగుతున్నాయి. వర్షం వస్తే పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతోంది. కొద్ది నెలల క్రితం.. భారీగా కురిసిన వర్షానికి సమీపంలోని పలు నివాసాల్లోకి వరద నీరు వెళ్లిపోయింది. శివాజీ పార్కు నుంచి జాతీయ రహదారి వరకూ ఉన్న డ్రైనేజీ ఇరుకుగా మారిపోవడం, చెత్తా చెదారం నిలిచిపోవడంతో కాలువ బ్లాక్ అయిపోయి, మురుగునీరు బయటకు పొంగింది. ఇది జరిగి దాదాపు తొమ్మిది నెలలు కావస్తోంది. సమస్య నివారణకు అప్పటికప్పుడు పొక్లెయిన్లతో కాలువను భారీగా తవ్వి, చెత్తను తొలగించారు. తిరిగి కాలువను నిర్మించడానికి జీవీఎంసి చాలా ఆలస్యం చేసింది. రెండు టెండర్లుగా సుమారు కోటి రూపాయలతో పనులు చేపట్టేందుకు ఓ సంస్థ కాంట్రాక్టు తీసుకుంది. అయితే, పనులు మొదలెట్టి దాదాపు మూడు నెలలు కావస్తున్నా, ఇంకా పూర్తి కాలేదు. అత్యంత రద్దీ గల జాతీయ రహదారిని ఆనుకుని పనులనుయుద్ధప్రాతిపదికన చేపట్టాల్సి ఉన్నా, నెమ్మదిగా సాగడంపైఅటుగా రాకపోకలు సాగించే నగర వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇదే కాలువలో ఓ వ్యక్తి మద్యం మత్తులో పడిపోయి మృతి చెందాడు కూడా. ఈ పనుల కారణంగా ప్రతి రోజూ ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఓ పక్క పెట్రోలు బంకులోకి వెళ్లి వచ్చే వాహనాలు, జాతీయ రహదారిపై తిరుగాడేవి, బంకును ఆనుకుని ఓ వైపు ఎంవీపీ కాలనీలోకి వెళ్లే దారి, మరో వైపు శివాజీపాలెం వైపు వెళ్లే రహదారి ఉంది. దీంతో ఈ ప్రాంతం అన్ని సమయాల్లోనూ రద్దీగా ఉంటోంది. రద్దీకి ఈ పనులు తోడవడంతో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.


నత్తనడకన సాగుతున్న డ్రైనేజీ మరమ్మతుల పనులు


తూతూ మంత్రంగా చేపట్టిన రక్షణ చర్యలు

విద్యా భాగస్వామ్యంపై ఐఐఎం, ఏసీసీఏ ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఐఐఎం, ఏసీసీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ (ఏసీసీఏ) శుక్రవారం విద్యా భాగస్వామ్యంపై అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. కో బ్రాండెడ్ ప్రోగ్రామ్స్, జ్ఞాన-భాగస్వామ్య వర్క్‌షాప్‌లు, విద్యార్థి కేంద్రీకృత సెమినార్లను భాగస్వామ్యంతో నిర్వహించేందుకు ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభాస్కర్, ఏసీసీఏ ఇండియా విద్యా భాగస్వామి సంబంధాల ప్రతినిధి ప్రభాన్సు మిట్టల్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ తమ సంస్థల విద్యార్థులకు విద్యా అవకాశాలను పెంపొందించడం, అకౌంటెన్సీ, ఫైనాన్స్‌లో ప్రొఫెషనల్ నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో విద్యా ఫలితాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కలిసి పనిచేస్తామన్నారు. ప్రభాన్సు మిట్టల్ మాట్లాడుతూ 180 దేశాల్లో ఉన్న ఏసీసీఏ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పాఠ్యాంశాల అభివృద్ధి కోసం ఐఐఎంను సహకరించేందుకు ఎదురు చూస్తోందని, ఈ ఒప్పందంతో ఆ లక్ష్యం నెరవేరిందని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

- అఖిల భారత్ విద్యార్థి పరిషత్ డిమాండ్


జీవీఎంసీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

సిరిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీ-యింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో మంజూరుకాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మెస్ చార్జీల భారంతో చదువులు సవ్యంగా సాగడంలేదన్నారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్, వెంకటేష్, ఆర్.నితిన్, ప్రసాద్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖను మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

- మెట్రో రైల్ ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- సీఐఐ సదస్సులో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పాల్గొన్న ఎస్‌బీఐ డీజీఎం రాహుల్ శంక్రిత్య, సీఐఐ చైర్మన్ కె.కుమార్‌రాజా తదితరులు

సిరిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. 'పట్టణ ప్రణాళిక- భవిష్యత్తులో సుస్థిరమైన నగరాభివృద్ధికి ఏ మేరకు చర్యలు చేపట్టాలి' అనే అంశంపై వీఎంఆర్డీఏ ఐజీబీసీ సమన్వయంతో సీఐఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశాఖ నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. విశాఖ నగరం మోడల్ సిటీగా రూపాంతరం చెందుతూ గణనీయమైన ప్రగతి సాధిస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇతర ప్రాంతాల నుంచి విశాఖ నగరానికి పారిశ్రామిక సంస్థలతో పాటు, పెట్టుబడిదారులు వస్తున్నారన్నారు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ ప్రాజెకుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. 2028-29 నాటికి మెట్రో రైల్ ప్రాజెక్టు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు మహిళలకు ఉచిత ప్రజా రవాణా అనేది ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. దీనివల్ల నగరానికి రాకపోకలు కూడా బాగా పెరిగాయని, తద్వారా ఇది అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. సముద్ర తీర ప్రాంతంలో ఉన్నందున తుపాన్ల ప్రభావంతో ఏర్పడే ఇబ్బందులను అధిగమించేలా రూ.200 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు కలెక్టర్ చెప్పారు. ఇందుకోసం రూ.550 కోట్లు వెచ్చిస్తున్నట్టు వెల్లడించారు. వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వీఎంఆర్డీఏ ద్వారా తగిన కార్యాచరణతో పనులు చేస్తున్నామన్నారు. ఎస్‌బీఐ డీజీఎం రాహుల్ శంక్రిత్య, సీఐఐ చైర్మన్ కె.కుమార్‌రాజా, మాజీ చైర్మన్ జీఎస్ శివకుమార్ మాట్లాడారు. సీఐఐ హెడ్ వీఎం మౌళి, వైస్ చైర్మన్ పీలా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శమీపూజకు అప్పన్న పూదోట ముస్తాబు


షమీ పూజకు ముస్తాబవుతున్న పూదోట

సింహాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చేనెల రెండో తేదీన నిర్వహించనున్న శమీపూజోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెడుపై మంచి విజయానికి గుర్తుగా ఏటా విజయదశమి రోజున ఈ ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. దీంతో పూదోటను శుభ్రపరచి గోడలకు, మండపానికి రంగులద్దుతున్నారు. శమీవృక్షం వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, మెట్లమార్గం రాళ్లు, నీటితడి, లేకుండా శుభ్రపరుస్తున్నారు. పల్లకిలో స్వామిని మెట్లమార్గంలో తీసుకువచ్చి పూదోటలో శమీపూజోత్సవం తరువాత రాజాలంకారంలో ఆశ్వవాహనంపై మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

మహాలక్ష్మికి కరెన్సీ నోట్లతో అలంకరణ



ఆరిలోవ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవీనవరాత్రుల పూజల్లో భాగంగా పాత డెయిరీ ఫారం వద్ద కొలువైన దుర్గామాతకు శుక్రవారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. మొత్తం రూ.28 వేలతో అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో సామూహిక కుంకుమార్చనలు


పూజల్లో పాల్గొన్న మహిళలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలోని శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వంద మంది మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సుమారు 3 వేల మంది పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వైసీపీ తూర్పు నియోజకవర్గం కన్వీనర్ మొల్లి అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు ఒమ్మి ముత్యాలరాజు, మాజీ అధ్యక్షులు పల్ల చిన్నారావు, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, శ్రీ సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, అధ్యక్షులు కర్రి వెంకట సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో ఖైదీలతో వాష్‌రూమ్ నిర్మాణం


ఖైదీలతో చేపట్టిన వాష్‌రూమ్ నిర్మాణం

ఆరిలోవ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) కేంద్ర కారాగారంలో బయట ఖైదీలతో వాష్ రూమ్ నిర్మాణం చేపట్టారు. సిబ్బంది ఉపయోగించే నిమిత్తం ఈ వాష్‌రూమ్ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తాపీ పనిలో అనుభవం ఉన్న ఖైదీలతో దీని నిర్మాణం చేపట్టినట్టు జైలు అధికారులు తెలిపారు. ఈ నిర్మాణ పనులు ఒక్క రోజులోనే శరవేగంగా పూర్తి చేయడం విశేషం.

హత్యాయత్నం కేసులో ముద్దాయికి ఆరేళ్ల జైలు


ముద్దాయి ములకపల్లి వెంకటనూకరాజు

గాజువాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో ముద్దాయి ములకపల్లి వెంకట నూకరాజు (50)కు ఆరు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.కవిత శుక్రవారం తీర్పు చెప్పారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పెదగంట్యాడ దుర్గవానిపాలేనికి చెందిన గంట్యాడ శివపై అదే ప్రాంతానికి చెందిన వరుసకు బావమరిది అయిన ములకలపల్లి వెంకటనూకరాజు 2022 ఏప్రిల్‌లో కత్తితో దాడిచేసి, హత్యకు యత్నించాడు. తప్పించుకున్న శివ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

నేడు పట్టాలెక్కనున్న బ్రహ్మపుర-సూరత్ కొత్త రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మపుర-సూరత్ (ఉద్నా) మధ్య రాకపోకలు సాగించే విధంగా ప్రవేశపెట్టనున్న కొత్త అమృతభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం (నేడు) పట్టాలెక్కనుంది. శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ మీదుగా ఒడిశా, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ ఖనిజ, వస్త్ర పారిశ్రామిక వ్యాపార కేంద్రాలకు చెందిన వివిధ జిల్లాలను కలుపుతూ రాకపోకలు సాగించే కొత్త రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఝార్సుగూడ స్టేషన్ నుంచి పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. 09022 నంబరు గల బ్రహ్మపుర-సూరత్ అమృతభారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27న మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మపురలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు సూరత్ చేరుతుంది. 19021, 19022 నంబర్లతో శాశ్వతప్రాతిపదికన నడవనున్న ఈ రైలు సర్వీసులు అక్టోబరు 5 నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

పినగాడి జంక్షన్‌లో రోడ్డుకు మరమ్మతులు

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేపగుంట నుంచి కె.కోటపాడు వైపు వెళ్లే రోడ్డులో పినగాడి జంక్షన్ వద్ద శిథిలమైన గోతులను శుక్రవారం టీడీపీ నేతలు క్రషర్ బుగ్గి తీసుకువచ్చి మరమ్మతులు చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పినగాడి జంక్షన్‌లో అన్ని వైపులా వర్షపునీటి కాలువలు మూసివేశారు. దీనికితోడు వేపగుంట నుంచి కె.కోటపాడు రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఇటీవలి వర్షాలకు పినగాడి జంక్షన్‌లో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి ఎదురయింది. మొగలిపురం నుంచి నగరానికి వస్తున్న టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ ఈ గోతుఁ చూసి వాహనం నిలిపి మరమ్మతులు చేయాలని పార్టీనాయకులకు సూచించారు. ఈ మేరకు గండి దేముడు, ఎంపీటీసీ సభ్యుడు తమరాన బంగారునాయుడు తదితరులు గోతులును తాత్కాలికంగా క్రషర్ బుగ్గితో కప్పేశారు. జేసీబీ సాయంతో పరిసరాల్లో నిలిచిన వర్షం నీరు పోయేలా మార్గం ఏర్పాటు చేశారు.

రైల్వే భూసేకరణ కాంపిటేటివ్ అథారిటీగా ఆర్డీవో

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింహాచలం నార్త్, గోపాలపట్నం మధ్య రైల్వేలైన్ల విస్తరణకు అవసరమైన భూ సేకరణకు కాంపిటేటివ్ అథారిటీగా విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీలేఖను నియమించారు. సింహాచలం నార్త్, గోపాలపట్నం మధ్య 2.64 కి.మీ. పొడవుగా ప్రస్తుతం ఉన్న రెండు లైన్లకు అదనంగా మూడు, నాలుగు లైన్లు వేస్తారు. ఈ మేరకు భూములు సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. ఇబ్బందులపై రైతులు, నివాసితులు తమ అభ్యంతరాలను ఆర్డీవోకు నివేదించవచ్చు.

సినిమా గైడ్

- **ఓజీ** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

ఈవీఎం గోదాంలను తనిఖీ చేసిన కలెక్టర్


విజిటర్స్ బుక్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరింధర్ ప్రసాద్

ఆరిలోవ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి రూరల్ మండలం సమీపంలో గల ఈవీఎం గోదాంలను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. త్రైమాస తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం గోదాంలను సందర్శించిన ఆయన అక్కడ భద్రతా పరిస్థితులు, సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడి అధికారులను పలు సూచనలు చేశా రు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లాగ్‌బుక్ నిర్వహణ, ఇతర అంశాలపై రాజకీయ నాయకుల ప్రతినిధులతో చర్చించారు. ఈ తనిఖీల్లో గ్రామీణ తహసీల్దార్ పాల్ కిరణ్, స్థానిక రెవెన్యూ ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలిపోయే స్థితిలో టెలిఫోన్ స్తంభం


ఒక పక్కకు ఒరిగిన టెలిఫోన్ స్తంభం (ఇన్‌సెట్‌లో) పాడైన స్తంభం కింది భాగం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు డీఆర్‌డీఏ కార్యాలయం సమీపంలో ఒక టెలిఫోన్ స్తంభం కూలిపోయే దశలో ఉంది. దీనిపై అనేక తీగెలు చుట్టి ఉండటంతో స్తంభం తాత్కాలికంగా నిలబడినట్టు కనిపిస్తోంది. స్తంభం కింది భాగం దాదాపు పూర్తిగా తుప్పు పట్టి ఉంది. ఇప్పటికే ఇది కాస్త ఒక పక్కకు వాలిపోయి ఉంది. పిల్లలు ఎక్కువగా తిరిగే ఈ ప్రాంతంలో స్తంభం పట్టుకొని కాస్త వంగినా, గట్టిగా గాలులు వీచినా పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది.

ఈ స్తంభం ఎప్పుడూ పడిపోతుందని స్థానికులు భయాందోళనలో ఉన్నారు. దీనిపై అధికారులు స్పందించి స్తంభం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 28, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

సాయిప్రియా బీచ్ రిసార్ట్స్‌లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


లలితా సహస్రనామం పఠిస్తున్న భక్తులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : రుషికొండలోని సాయిప్రియా బీచ్ రిసార్ట్స్‌లో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ఆధ్యాత్మిక కార్య క్రమాలు నిర్వహించారు. లలిత సహస్రనామ పారాయణం, శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ భజనలు, బాలపూజ, సువాసిని పూజ, చిన్నారులతో సంగీత కచేరి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు భక్తులను, రిసార్ట్స్‌కు వచ్చిన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రి సార్ట్స్ ఎండీ డీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రూ నిత్యం ఆధ్యాత్మిక ఆనందం పొందాలన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్ శంకర్ నారాయణ, రాధిక, కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 28, 29, 30వ తేదీల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మహా చండీయాగం నిర్వహించనున్నట్టువెల్లడించారు.

ద్రోణంరాజు మనవడు రవికిరణ్ మృతి


రవికిరణ్ (ఫైల్)

పెందుర్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దివంగత రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ మనవడు రవికిరణ్ (43) గుండెపోటుతో చినముషిడివాడలోని స్వగృహంలో శుక్రవారం కన్నుమూశారు. ద్రోణంరాజు రెండో కుమార్తె కుమారుడైన రవికిరణ్ వైసీపీ కార్యకర్త. మాజీ ఎమ్మెల్యేలు గుడివాడ అమర్‌నాథ్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ రవికిరణ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

రూ.50 లక్షలతో మహాలక్ష్మిగా అలంకరణ



అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): షీలానగర్ దుర్గాకాలనీ ఆలయంలో శుక్రవారం అమ్మవారిని రూ.50 లక్షల నగదుతో మహాలక్ష్మిగా అలంకరించారు. ధర్మకర్త కాండ్రేగుల జగ్గారావు, సత్యవతి దంపతులు ప్రత్యేకపూజలు చేశారు. భవానీమాలధారులకు అన్నసమారాధన చేశా రు. గవర జగ్గయ్యపాలెం,షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీవాసులు దర్శించుకున్నారు.

శరణు భవానీ!


గాయత్రి దేవిగా వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు


శివరామకృష్ణ దేవాలయంలో మహాలక్ష్మీ అవతారంలో ఉమాదేవి


బర్మాక్యాంప్ నూకాంబిక ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


సీతమ్మధారలో రేణుక దేవిగా దుర్గాదేవి అమ్మవారు


శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వర స్వామి అలంకరణ

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఐదోరోజు శుక్రవారం గాయత్రిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు, పండ్లరసాలతో కలిపి 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. సాయంత్రం మహిళలతో వాసవి కనకదుర్గకు కోటి కుంకుమార్చనలు, హోమం, మణిద్వీప వర్ణన, పారాయణం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ ఏర్పాట్లు చేశారు. శనివారం కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీబాలాజీ రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మహాలక్ష్మీ అవతారంలో ఉమాదేవి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని దేవదాయ శాఖ అజమాయిషీలో ఉన్న శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం హారతులిచ్చారు. ఆలయ ఈవో రమాబాయి పర్యవేక్షణలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి జి.మన్మథరెడ్డి, అర్చకులు భార్గవశర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నూకాంబిక అమ్మవారి ఆలయంలో...

మురళీనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం 49వవార్డు బర్మాక్యాంప్ నూకాంబిక అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బుచ్చిబాబు శర్మ అమ్మవారి సన్నిధిలో పూజాదికాలు నిర్వహించి ఉత్సవ నిర్వహణ చేపట్టారు. ఆలయ ఈవో మూర్తి పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. మాధవధార సీతన్న గార్డెన్స్ కనకమహాలక్ష్మి ఆలయం, మురళీనగర్ హైస్కూలు దగ్గరి లలితాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కాలనీ, ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మాధవధార, ఉడాకాలనీ, పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో ఉత్సవ వేదికల వద్ద ప్రత్యేక దీపాలంకరణ చేపట్టారు.

రేణుకదేవిగా..

సీతమ్మధార, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో గల షిరిడి సాయిబాబా, వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి దేవాలయంలో అమ్మవారిని రేణుకదేవిగా అలంకరించారు. అయ్యవారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా అలంకరించి భక్తులకు అనుమతించారు. ఆలయ ఈఓ బందారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు వేదమంత్రాలతో అభిషేకాలు, పూజలు జరిపారు.

కాన్వెంటు కూడలిలో ..


కాన్వెంట్ కూడలిలో అమ్మవారిని దర్శించుకుంటున్న స్థానిక నాయకులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాన్వెంటు కూడలిలోని జ్ఞానాపురం టోకు కాయగూరల మార్కెట్ వద్ద ఘనంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి నిత్యం కుంకుమపూజలు చేస్తున్నారు. కాన్వెంటు కూడలి వద్ద విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. అక్టోబరు 2 వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సీఎంఆర్ షాపింగ్‌మాల్ పునఃప్రారంభం


షాపింగ్‌మాల్ ప్రారంభించిన సినీనటి రితికా నాయక్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సరికొత్త హంగులతో మరింత సువిశాలంగా, వైభవంగా తీర్చిదిద్దిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ప్రముఖ సినీతార, మిరాయ్ ఫేం హీరోయిన్ రితికా నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ జడ్జికోర్టు ఎదురుగా ఉన్న షాపింగ్ మాల్‌ను కస్టమర్లను ఆకట్టుకునేలా సరికొత్త కలెక్షన్లతో నేడు పునఃప్రారంభించినట్లు తెలిపారు. 1984లో చందన బ్రదర్స్ పేరుతో, 2002లో జిల్లా కోర్టు ఎదురుగా సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత నాలుగు దశాబ్దాల్లో 4 రాష్ట్రాలలో 42 శాఖలను ప్రారంభించి విజయవంతంగా నడుపుతున్నామని తెలిపారు. కస్టమర్ల అభిరుచికి, లేటెస్టు ఫ్యాషన్సుకు తగ్గట్టుగా విస్తృతమైన వస్త్రశ్రేణితో అతి తక్కువ ధరలకు సేవలందించటమే ముఖ్యఉద్దేశమని వివరించారు. అంతేకాకుండా దసరా సందర్భంగా ప్రతీ 999 రూపాయల వస్త్రాల కొనుగోలుపై ఒక బహుమతి అందించనున్నట్లు తెలిపారు. నూతన జీఎస్టీ విధానాలకు అనుగుణంగా తగ్గింపు ధరలకు వస్త్రాలను వినియోగదారులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మావూరి మోహన బాలాజీ, నూలు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పతక విజేతకు జీవీఎంసీ కమిషనర్ అభినందన


జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసిన విజేత లింగేశ్వరరావు, కార్పొరేటర్ ఉషశ్రీ

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో రజత పతకం సాధించిన అంతర్జాతీయ షట్లర్ బీవీఎస్‌కె.లింగేశ్వరరావును శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తన కార్యాలయంలో అభినందించారు. థాయిలాండ్‌లో 192 దేశాలకు చెందిన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ టోర్నీలో భారత్ నుంచి 90 మంది షట్లర్లు ప్రాతినిధ్యం వహించారని, అయితే భారత్‌కు ఏడు పతకాలు మాత్రమే దక్కగా, వాటిలో 55 ప్లస్ మిక్స్‌డ్ డబల్స్‌లో పార్టనర్ సజన్ వింగ్లెట్‌తో కలిసి రజత పతకం సాధించిన అంశాన్ని కమిషనర్‌కు లింగేశ్వరరావు వివరించారు. అలాగే లింగేశ్వరరావు ఇప్పటి వరకు సాధించిన అంతర్జాతీయ పతకాల వివరాలను తెలుసుకున్న కమిషనర్ కేతన్‌గార్గ్ విశాఖ క్రీడా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటడం విశేషమని, వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. కార్పొరేటర్, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ ప్రధాన కార్యదర్శి ఉషశ్రీ పాల్గొన్నారు.

అక్టోబరులో జర్నలిస్టులకు వైద్య శిబిరం: కలెక్టర్

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్టోబరులో జర్నలిస్టులకు వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావుల ఆధ్వర్యంలో జర్నలిస్టులు శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ ప్రీమియాన్ని సీఎస్ఆర్ నిధుల నుంచి చెల్లిస్తామని, ఇప్పటికే కార్యాచరణ జరుగుతోందని తెలిపారు. ఆదేవిధంగా గుర్తింపు పొందిన ఆసుపత్రుల ద్వారా వైద్య శిబిరాలు సైతం నిర్వహిస్తామని తెలిపారు. కార్యవర్గ సభ్యులు కె.చంద్రమోహన్, డి.హరనాథ్, పరశురామ్ పాల్గొన్నారు.

జోన్-2 పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాధవధార, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ జోన్-2 పరిధి ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో శనివారం (నేడు) విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడనున్నట్లు డీఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఎయిర్‌పోర్ట్, ఎన్ఏడీ ఫీడర్‌లలో పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు. మాధవధార, మర్రిపాలెం, పార్వతీనగర్, ఎన్ఏడీ గణేష్‌నగర్, కాకానినగర్, విమాన్‌నగర్, దుర్గాపురం ప్రాంతాలకు సరఫరా ఉండదు. వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

కంచరపాలెం: కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో తోటవది, దుర్గానగర్, మల్లసూరి వీధి, గోకుల్‌నగర్, గౌరీ నగర్, సుభాష్‌నగర్, తమ్ముడుపాలెం తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు.

స్కానింగ్ కేంద్రాల నిశిత పరిశీలనకు కలెక్టర్ ఆదేశం


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో స్కానింగ్ చేసే వారి విద్యార్హతలు, స్కానింగ్ సెంటర్ల డాక్యుమెంట్లు పరిశీలించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావును ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లింగ నిర్ధారణ చట్టం అమలు, జిల్లా స్థాయి ఎడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రంవారు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తును పూర్తిగా పరిశీలించిన తరువాతే అనుమతులు ఇవ్వాలని సూచించారు. అన్ని ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లలో విధిగా ఐదు శాతం ఉచిత స్కాన్‌లు చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అందించాలని ఆదేశించారు. నెలలో గర్భిణులకు సంబంధించిన స్కాన్‌లలో 5 శాతం ఉచితంగా చేసిన వివరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అందించాక రెన్యువల్ రిజిస్ట్రేషన్ పొందాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల సహకారంతో డెకాయ్ ఆపరేషన్‌లు ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు వైద్యులు, వైద్యాధికారులు, ఎన్‌జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్టపరిహారం ఇప్పించండి: ఎమ్మెల్యే వంశీకృష్ణ


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే సీహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం శాసనసభలో ప్రస్తావించారు. మూడేళ్ల కిందట సముద్రంలో మునిగిపోయిన, కొన్ని కాలిపోయిన బోట్ల యజమానులకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని, గత ప్రభుత్వ తప్పిదం వల్ల పేద మత్స్యకారులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. మత్స్యశాఖ, విపత్తు శాఖల మధ్య సమన్వయలోపాన్ని ప్రస్తావించారు. రూ.2.8 కోట్ల బకాయిలు త్వరగా మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు డీజిల్ సబ్సిడీని 9 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని ప్రస్తావించారు. కేజీహెచ్, ఘోషా ఆస్పత్రిలో సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.

డీఎస్సీలో మహిళలదే పైచేయి

... 5వ పేజీ తరువాయి

28 మంది, విశాఖపట్నం సౌత్ నుంచి 25 మంది, అతి తక్కువగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం నుంచి నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇతర జిల్లాల నుంచి నాన్‌లోకల్ కోటాలో 93 మంది ఎంపికయ్యారు. కాగా ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకున్న వారికి వచ్చే నెల మూడో తేదీ నుంచి శిక్షణ ఇస్తామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

... 5వ పేజీ తరువాయి

ఇతర వృత్తులు, అక్టోబరు 7 నుంచి 13 వరకూ విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్, అక్టోబరు 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, రెన్యుబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్ తదితర అంశాలపై షాపింగ్‌మాల్ ఫెస్టివల్ నిర్వహిస్తామని వివరించారు.

ఏయూ పాలకుల దిద్దుబాట

... 5వ పేజీ తరువాయి

వాస్తవానికి ఆక్సిజన్ ఉందని చెప్పారు.

ఆక్సిజన్ ఎవరు పెట్టాలి?

అంబులెన్స్ ఎక్కడికైనా వెళితే.. డ్రైవర్‌తో పాటు సహాయక సిబ్బంది కనీసం ఒకరైనా ఉంటారు. వాహనాన్ని డ్రైవర్ నడిపితే, రెండో వ్యక్తి రోగికి అవసరమైన ప్రాథమిక చికిత్స చేస్తారు. వారికి ఆక్సిజన్ పెట్టడం వంటి పనులు వచ్చి ఉండాలి. అయితే ఏయూ హెల్త్ సెంటర్ అంబులెన్స్‌కు డ్రైవర్ తప్ప ఇతర సిబ్బంది లేరు. దాంతో ఆక్సిజన్ ఉన్నా దానిని పెట్టే అవకాశం లేకుండా పోయింది. వసతులు ఉన్నా వాటిని ఉపయోగించే సిబ్బంది, వారికి శిక్షణ కూడా అవసరమనే విషయం అధికారులు విస్మరించారు. ఇప్పటికైనా తూతూ మంత్రంగా కాకుండా, పూర్తిస్థాయిలో చిత్తశుద్ధితో తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆటో డ్రైవర్ హత్య

... 5వ పేజీ తరువాయి

తరుణ్ కర్రతో గణేష్ తలపై గట్టిగా కొట్టాడు. దీంతో గణేష్ తీవ్ర రక్తస్రావమై కుప్పకూలిపోయి మృతిచెందాడు. రాత్రి గస్తీ విధుల్లో ఉన్న పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మూడో లైనులో హైస్పీడ్ ట్రయిల్ రన్ విజయవంతం


బొబ్బిలి ప్రాంతంలో మూడో లైన్‌ను పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికార బృందం

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని డొంకినవలస, బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం స్టేషన్లను కలుపుతూ కొత్తగా 36 కి.మీ. నిడివిలో మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణ పూర్తయిన నేపథ్యంలో రైల్వే భద్రత కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా శుక్రవారం కొత్త ట్రాక్‌పై హైస్పీడ్ ట్రయిల్ రన్ నిర్వహించారు. ట్రాక్, విద్యుదీకరణ పూర్తి కావడంతో 25టీ యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా కొత్తగా నిర్మించిన పట్టాలు, వంతెనలు, మలుపులు పరిశీలించిన తర్వాత నిర్వహించిన ట్రయిల్ రన్ విజయవంతంగా పూర్తయింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేషన్ యార్డులు, క్రాస్ ఓవర్లు, హైలెవెల్ ప్లాట్‌ఫామ్‌లు, వంతెనలను తనిఖీ చేసిన బ్రిజేష్ కుమార్ పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. అప్‌గ్రేడ్ చేసిన లైనులో స్పీడ్ ట్రయిల్ రన్ నిర్వహించిన అనంతరం రైలు ట్రాఫిక్ కార్యకలాపాలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుశ్ గుప్తా, చీఫ్ బ్రిడ్జి ఇంజనీర్ అశోక్‌కుమార్, ఆర్‌వీఎన్ఎల్ డైరక్టర్ ఎస్.కె.పాత్రో, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సముద్రంలో కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డులు


హుసేన్‌ను ఒడ్డుకు తీసుకొచ్చిన లైఫ్‌గార్డులు

మహారాణిపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో స్నానం చేస్తూ కెరటాల ఉధృతికి కొట్టుకుపోతున్న యువకుడిని లైఫ్‌గార్డులు కాపాడారు. గోపాలపట్నంకు చెందిన షేక్ హుసేన్ (21), మరో ఇద్దరితో కలిసి శుక్రవారం సాయంత్రం సరదాగా బీచ్‌కు వచ్చాడు. ఆర్‌కే బీచ్ వద్ద స్నానం చేసేందుకు సముద్రం లోపలకు వెళ్లాడు. అసలే అల్పపీడనం కారణంగా అలలు ఉధృతంగా రావటంతో హుసేన్ సముద్రం లోపలకు కొట్టుకుపోయాడు. అది గుర్తించిన జీవీఎంసీ లైఫ్‌గార్డులు పోలరాజు, నవీన్, రాకేష్‌లు వెంటనే లోపలకు వెళ్లి హుసేన్‌ను కాపాడారు. ఒడ్డుకు తీసుకు వచ్చి ప్రథమ చికిత్స అందించి కాపాడి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెత్త తరలింపులో లాలూచీ

... 5వ పేజీ తరువాయి

రోడ్లపై చెత్త జారిపడిపోవడం, గాలికి ఎగిరి రోడ్డుపై వచ్చేవారిపై పడడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతుండడంతో సీసీఎస్ ప్రాజెక్టుకు అధికారులు రూపకల్పన చేశారు. ఈ విధానంలో జోన్ స్థాయిలో ఉండే ఎంఎస్ఎఫ్ వద్దకు చెత్తను క్లాప్ వాహనాలు తీసుకువచ్చినప్పుడు ఎత్తైన బ్రిడ్జిపైకి వెళ్లి అక్కడి నుంచి ఒక గల్లాలోకి వేస్తాయి. గల్లాలో పడిన చెత్తను ప్రత్యేకమైన యంత్రం సహాయంతో ఒక కేక్ మాదిరిగా ప్రెస్‌చేసి నేరుగా ట్యాంకర్‌లోకి పడేస్తారు. తర్వాత వెనుక వైపు డోర్ వేసి బయటకు చెత్త కనిపించకుండా, వాసన రాకుండా చేస్తారు. ట్యాంకర్ ద్వారా చెత్తను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ విధానాన్ని జీవీఎంసీ పరిధిలో వన్‌టౌన్‌లోని టౌన్‌కొత్తరోడ్డు వద్ద ఉన్న ఎంఎస్ఎఫ్‌తోపాటు గాజువాక, ముడసర్లోవ, చీమలాపల్లి ఎంఎస్ఎఫ్‌ల్లో అమలు చేస్తున్నారు.

నిర్వహణ కాంట్రాక్టర్లకు అప్పగింత

సీసీఎస్ ప్రాజెక్టులో భాగంగా ఎంఎస్ఎఫ్ వద్ద యంత్రాలను అమర్చడంతోపాటు రెండు ట్యాంకర్ లారీలను జీవీఎంసీ సమకూర్చింది. లారీలకు అవసరమైన డీజిల్‌ను జీవీఎంసీయే సమకూర్చుతుంది. డ్రైవర్లను నియమించుకుని ఆయా వాహనాలు, ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (నిర్వహణ) బాధ్యతను ఏటా టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక ఎంఎస్ఎఫ్‌ల్లోని సీసీఎస్ ప్రాజెక్టుల నిర్వహణను గత ఏడాది సుమారు రూ.రెండు కోట్లకు ఒకే కాంట్రాక్టర్ దక్కించుకోగా, ముడసర్లోవ, చీమలాపల్లి సీసీఎస్‌లను దాదాపు అంతే మొత్తానికి మరో ఇద్దరు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఆయా ప్రాజెక్టులతోపాటు ట్యాంకర్ లారీల నిర్వహణ, మరమ్మతులు కూడా సంబంధిత కాంట్రాక్టరే చూసుకోవాల్సి ఉంటుంది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

సీసీఎస్ ప్రాజెక్టులను పక్కాగా నిర్వహించాల్సిన కాంట్రాక్టర్లలో ఇద్దరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టు వద్ద రెండు ట్యాంకర్ టిప్పర్లలో ఒకటి గత ఆరు నెలలుగా పనిచేయకపోవడంతో షెడ్‌లోనే ఉంది. కానీ ఆ వాహనం పేరుతో ప్రతి నెలా డీజిల్‌ను తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టును పరిశీలించిన కమిషనర్ కేతన్‌గార్గ్ అక్కడి నిర్వహణపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. చెత్త భారీగా పేరుకుపోయి ఉండడంతో ప్రాజెక్టు నిర్వహణపై ఆరా తీశారు. కాంట్రాక్టర్ సరిగా పనిచేయడం లేదని ప్రాథమికంగా గుర్తించడంతో అతడి టెండర్‌ను నిలుపుదల చేస్తూ నోటీసు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు వెంటనే నోటీసు జారీచేశారు. అయితే అదే కాంట్రాక్టర్‌తో ఇప్పటికీ పనులు కొనసాగిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇదిలావుండగా టౌన్‌కొత్తరోడ్డుతో పాటు, గాజువాకలోని సీసీఎస్ ప్రాజెక్టులో కొన్ని పరికరాలు మరమ్మతుకు గురయ్యాయి. వాటికి రూ.1.5 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టరే వెచ్చించి చెత్త తరలింపు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, జీవీఎంసీ నుంచి మంజూరు చేసేందుకు వీలుగా అధికారులు ప్రతిపాదనలు తయారుచేస్తున్నట్టు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీనిపై మెకానికల్ విభాగం ఎస్ఈ గోవిందరావును వివరణ కోరగా టౌన్‌కొత్తరోడ్డులోని సీసీఎస్ ప్రాజెక్టులో ఒక ట్యాంకర్ లారీ ఆరునెలలుగా పనిచేయడం లేదని, అయితే దానికి డీజిల్ డ్రా చేస్తున్నట్టు తనకు తెలియదన్నారు. అలాగే ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్‌ను తొలగించాలని కమిషనర్ నోటీసు ఇవ్వడం వాస్తవమేనని, కొత్త కాంట్రాక్టర్ ఇప్పటికిప్పుడు దొరకరు కాబట్టి, ఆయన్నే కొనసాగిస్తున్నామని చెప్పడం విశేషం. టౌన్‌కొత్తరోడ్డు, గాజువాక ప్రాజెక్టులకు సంబంధించిన ఫైళ్లను తెప్పించుకుని పరిశీలిస్తానన్నారు.

పర్యాటకం... ప్రచారం పూజ్యం

... 5వ పేజీ తరువాయి

ఫ్లోటింగ్ రెస్టారెంట్‌గా మారుస్తామని నౌకను కొనుగోలు చేసిన గిల్ సంస్థ అప్పటి నుంచి కోరుతూనే ఉంది. దానికీ అనుమతి ఇవ్వలేదు. విశాఖపట్నం పోర్టు రూ.100 కోట్ల వ్యయంతో క్రూయిజ్ టెర్మినల్ నిర్మించింది. ఏడాదికి రెండుసార్లు కార్డిలియో క్రూయిజర్ తప్ప ఇంకొకటి రావడం లేదు. పర్యాటక శాఖ అధికారులు ఏమి చేస్తున్నారనేది పెద్ద ప్రశ్న.

రుషికొండ బీచ్ నిర్వహణలోనూ లోపాలే. దానికి గతంలో వచ్చిన బ్లూఫ్లాగ్ గుర్తింపు పోయేలా వ్యవహరించారు. కింద మీద పడి మళ్లీ దానిని నిలబెట్టారు. ఇప్పటికీ అది సమస్యగానే ఉంది. నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు సంస్థకు అప్పగించాలని టెండర్లు పిలిచారు. అది ప్రైవేటు చేతికి వెళ్లిపోతే ఏపీటీడీసీకి అడ్డగోలుగా వచ్చే లక్షలాది రూపాయల ఆదాయం పోతుందని కఠిన నిబంధనలు పెట్టారు. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే జరుగుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి.

పర్యాటక సమాచారమూ శూన్యమే

విశాఖపట్నం పర్యాటక శాఖ అధికారుల వద్ద నగరానికి ఎంతమంది పర్యాటకులు వస్తున్నారు? వారిలో అంతర్జాతీయ పర్యాటకులు ఎంత మంది?, దేశీయ పర్యాటకులు ఎంతమంది?, ఏయే రాష్ట్రాల నుంచి వస్తున్నారు?...అనే కనీస సమాచారం కూడా లేదు. ఎటువంటి రికార్డులు నిర్వహించడం లేదు.

డబుల్ డెక్కర్‌కు ఆదాయం పెంచే ఆలోచన శూన్యం

నగరంలో ఇటీవలె సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా డబుల్ డెక్కర్ బస్సులు రెండింటిని ప్రారంభించారు. వాటికి టిక్కెట్ ధరలు పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100 పెట్టారు. వారాంతాలైన శని, ఆదివారాల్లో తప్పితే మిగిలిన రోజుల్లో వాటికి ఆదరణ ఉండడం లేదు. ముగ్గురు, నలుగురికి మించి ఎక్కడం లేదు. ఈ బస్సులకు ఆదాయం వచ్చేలా ఎలా ఉపయోగించుకోవాలనే ఆలోచన కూడా లేదు. ఖాళీగా ఉన్నాయని తీసుకువెళ్లి సాగర్‌నగర్‌లో ఛార్జింగ్ పాయింట్ వద్ద ఉంచేస్తున్నారు. భీమిలికి బీచ్ మార్గంలో బస్సులు తక్కువ. అటు వైపు పేరొందిన కాలేజీలు, ఐటీ సంస్థలు ఉన్నాయి. వారికైనా ఉపయోగపడేలా...కాసింత రేటు తగ్గించి రెగ్యులర్‌గా నడిపితే ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆ ఆలోచన కూడా లేదు.

వీఎంఆర్‌డీఏ వల్ల నిలబడుతున్న పరువు

వీఎంఆర్‌డీఏ వల్లనే పర్యాటక శాఖ పరువు నిలబడుతున్నదంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులు తీసుకువస్తూ పర్యాటకుల సంఖ్య పెంచేందుకు యత్నిస్తోంది. ఈ ఒక్క ఏడాదిలోనే కైలాసగిరిపై స్కై సైక్లింగ్, జిప్ లైనర్ ప్రారంభించింది. అక్కడే గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది. బీచ్ రోడ్డులో యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభించింది.

వీటిపై పునరాలోచన అవసరం

చిన్న చిన్న ప్రాజెక్టులు పెడతామని ముందుకు వచ్చిన వారికి ప్రభుత్వం ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదు?, దానికి కారణాలు ఏమిటి?, ఎన్ని ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయనే దానిపై ఒకసారి సమీక్షిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయి. పర్యాటక శాఖకు ప్రచారం కూడా చాలా ముఖ్యం. దానిపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అగనంపూడి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధి లోని మంగళపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దువ్వాడ సెక్టర్-1, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, నంగినారపాడు, అజనగిరి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భారీ అన్న సమారాధన

పెదగంట్యాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 64వవార్డు పరిధి కొత్తదిబ్బపాలెంలో శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాలనీ మహిళలు కార్యక్రమం నిర్వహించారు. కాలనీ పెద్దలు, యూత్ అసోసియేషన్ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు సేవలందించారు.

జిల్లా నాయీ బ్రహ్మణ సేవా సంఘం ఎన్నిక

ఎన్ఏడీ జంక్షన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా నాయీ బ్రాహ్మణ సేవాసంఘం పాత కమిటీని రద్దుచేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎం.రమణ, అధ్యక్షుడిగా కె.గణపతిరావు, కోశాధికారిగా సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రాజారావు, సన్యాసిరావు, వర్మ, అధికార ప్రతినిధిగా బి.వెంకటరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.సన్యాసిరావు, టి.అప్పారావు, శంకరరావు, ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

చింతల అగ్రహారంలో నేడు క్రికెట్ పోటీలు

పెందుర్తిరూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం చింతల అగ్రహారంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం (నేడు) స్థానిక రామాలయం వద్ద సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. రాత్రి 9 గంటలకు పోటీలు మొదలవుతాయని, పాల్గొనే జట్లు ముందుగా కమిటీని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొంది. వివరాలకు 81060 30660, 95503 10094 మొబైల్ నెంబర్లలో సంప్రదించాలని కమిటీ తెలిపింది.

పైపులైన్‌కు మరమ్మతులు



పైపు లైన్‌ను సరిచేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ సబ్‌స్టేషన్ వద్ద పగిలిన అండర్ గ్రౌండ్ పైపులైన్‌ను జీవీఎంసీ అధికారులు, సిబ్బంది శుక్రవారం సరిచేశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి తాగునీరు లీక్ కాకుండా చేశారు. వృథాగా పోతున్న తాగునీరు.. అధికారులు పట్టించుకోరు శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి నీటి వృథాను అరికట్టారు. పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్, కొత్తదిబ్బపాలేనికి నీటి సరఫరా మెరుగయింది.

సినిమా గైడ్

- **ఓజీ** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 28, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళదుంపలు 19, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 70, అల్లం 70, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు(కిలో) 60, బద్దచిక్కుడు 50, దోసకాయలు 20, వెల్లుల్లి 70, కొబ్బరికాయ 40, బీన్స్ 50, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

విశాఖను మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

- మెట్రో రైల్ ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- సీఐఐ సదస్సులో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



సీఐఐ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సిరిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. 'పట్టణ ప్రణాళిక- భవిష్యత్తులో సుస్థిరమైన నగరాభివృద్ధికి ఏ మేరకు చర్యలు చేపట్టాలి' అనే అంశంపై వీఎంఆర్డీఏ ఐజీబీసీ సమన్వయంతో సీఐఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశాఖ నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. విశాఖ నగరం మోడల్ సిటీగా రూపాంతరం చెందుతూ గణనీయమైన ప్రగతి సాధిస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ఇతర ప్రాంతాల నుంచి పారిశ్రామిక సంస్థలతో పాటు, పెట్టుబడిదారులు వస్తున్నారన్నారు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ ప్రాజెకుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. 2028-29 నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు మహిళలకు ఉచిత ప్రజా రవాణా ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. దీనివల్ల నగరానికి రాకపోకలు పెరిగాయని, తద్వారా అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. సముద్ర తీర ప్రాంతంలో ఉన్నందున తుపాన్ల ప్రభావంతో ఏర్పడే ఇబ్బందులను అధిగమించేలా రూ.200 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు కలెక్టర్ చెప్పారు. ఇందుకోసం రూ.550 కోట్లు వెచ్చిస్తున్నట్టు వెల్లడించారు. వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వీఎంఆర్డీఏ ద్వారా తగిన కార్యాచరణతో పనులు చేస్తున్నామన్నారు. సదస్సులో ఎస్‌బీఐ డీజీఎం రాహుల్ శంక్రిత్య, సీఐఐ చైర్మన్ కె.కుమార్‌రాజా, మాజీ చైర్మన్ జీఎస్ శివకుమార్ మాట్లాడారు. సీఐఐ హెడ్ వీఎం మౌళి, వైస్ చైర్మన్ పీలా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపంలో జోనల్ కార్యాలయం

- అగనంపూడిలో ఏర్పాట్లు చేస్తున్న జీవీఎంసీ అధికారులు



అగనంపూడిలో జీవీఎంసీ కల్యాణ మండపం

గాజువాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జోన్ల పెంపు లో భాగంగా గాజువాక పరిధిలో ప్రస్తుత 19 వార్డుల నుంచి 77, 78, 79, 85 వా ర్డులతో కొత్తగా అగనంపూడి జోన్ ఏర్పాటు కానుంది. ఈ క్రమంలో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు అగనంపూడిలో ఉన్న జీవీఎంసీ కల్యాణ మండపాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. జోనల్ కమిషనర్, ఏఎంవోహెచ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, ఆర్వో, ఈఈ, ఏపీడీ, తదితర విభాగాల అధికారుల చాంబర్లు ఏర్పాటుకు ఇంజనీరింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల్లోగా చాంబర్ల పనులు పూర్తి చేయనున్నారు. నవంబరు మొదటివారంలోగా కొత్త జోనల్ కార్యాలయాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. గాజువాక జోనల్ కార్యాలయం నుంచి వేరు చేసిన నాలుగు వార్డులు పెందుర్తి నియోజకవర్గ పరిధిలో ఉండగా, అగనంపూడిలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల వారికి మరింత చేరువవుతుంది. దీంతో జీవీఎంసీ సేవలు పొందేందుకు వీలు కలుగుతుందని భావిస్తున్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా దసరా వేడుకలు

అగనంపూడి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులకు దసరా ఉద్దేశాన్ని తెలియజేశారు. ఈ ఏడాది 78 శాతం విద్యార్థులు సుమారు 150 కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వైశ్రీనివాసరావు, అరుంధతి, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

మల్కాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం ప్రధాన కూడలి సెంటర్ డివైడర్‌లో శుక్రవారం అనాథ మృతి చెందారు. మల్కాపురం పోలీసులకు సమాచారం అందడంతో పరిశీలించారు. అనంతరం పీవీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టుకు తెలపడంతో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని తోపుడు రిక్షా మీద వేసి శ్మశానవాటికకు తరలించారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.

శమీ పూజకు అప్పన్న పూదోట ముస్తాబు

సింహాచలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చేనెల రెండో తేదీన నిర్వహించనున్న శమీపూజోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూదోటను శుభ్రపరచి గోడలకు, మండపానికి రంగులద్దుతున్నారు. శమీవృక్షం వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, మెట్లమార్గం రాళ్లు, నీటితడి, లేకుండా శుభ్రపరుస్తున్నారు. పల్లకిలో స్వామిని మెట్లమార్గంలో తీసుకువచ్చి పూదోటలో శమీపూజోత్సవం తరువాత రాజాలంకారంలో అశ్వవాహనంపై మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

అగనంపూడిలో భారీ వర్షం



అగనంపూడిలో వర్షం కురుస్తున్న దృశ్యం

అగనంపూడి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి అగనంపూడి, లంకెలపాలెం ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంత గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి వర్షపు నీరు పారింది. ఉదయం 11 గంటల వరకు తీవ్ర ఉక్కు పోతతో అవస్థ పడిన ప్రజలు ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. దువ్వాడ రహదారిలో నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. అలాగే నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో వర్షానికి మురుగు నీరు రహదారుల పైకి రావడంతో నివాసితులు ఇబ్బందులు పడ్డారు.

క్రీడల్లో బెహరా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి విజయచైతన్య

గోపాలపట్నం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో ఇటీవల ఏయూలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో బెహరా నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విజేతలను శుక్రవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయచైతన్య, అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్, పిన్సిపాల్ హిందుమతి, అధ్యాపకులు అభినందించారు.



తుంగ్లాంలో రూ.10 లక్షలతో అలంకరణ



డ్రైవర్స్ కాలనీలో మహాలక్ష్మిగా...



నాయుడుతోట కృష్ణనగర్‌లో...



కొత్తపాలెంలో రూ.2 లక్షలతో అలంకరణ

మహాలక్ష్మీ నమోస్తుతే!

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరెన్సీ నోట్లతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో శుక్రవారం దుర్గాదేవి మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలను కరెన్సీ నోట్లతో అలంకరించారు. షీలానగర్ దుర్గాకాలనీ ఆలయంలో శుక్రవారం అమ్మవారిని రూ.50 లక్షల నగదుతో మహాలక్ష్మిగా అలంకరించారు. ధర్మకర్త కాండ్రేగుల జగ్గారావు, సత్యవతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భవానీ మాలధారులకు అన్న సమారాధన చేశారు. గవర జగ్గయ్యపాలెం, షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ వాసులు దర్శించుకున్నారు.

దుర్గమాంబ ఆలయంలో...

అగనంపూడి: స్థానిక దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని రూ.69,500 విలువైన కరెన్సీ నోటతో అలంకరించారు. పెదమడక కొండపై దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

త్రిశక్తి ఆలయంలో

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటు టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మహాదుర్గ అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా, మహాలక్ష్మిని ఐశ్వర్య లక్ష్మీదేవిగా, మహా సరస్వతిని జగద్విఖ్యాతదేవిగా అలంకరించారు.

కూర్మన్నపాలెంలో...

కూర్మన్నపాలెం: ఎల్వీనగర్ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. డ్రైవర్సు కాలనీలో పుష్పాలతో అలంకరించారు. రాజీవ్‌నగర్‌లో సామూహిక కుంకుమ పూజలు చేశారు. శ్రీనివాసనగర్‌లో క్రేజీ యూత్ ఆధ్వర్యంలో రూ.2 లక్షలతో అమ్మను అలంకరించారు.

విజయదుర్గాదేవి ఆలయంలో

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వవార్డు కండిపిల్లివీధి శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు లక్ష్మీదేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సతీమణి, ఏయూ ప్రొఫెసర్ ఆచార్య పల్లా లావణ్యదేవి పాల్గొన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఆలయ ధర్మకర్తలు తిప్పల దుర్యోధన, లక్ష్మలు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కడవల రమణ ఆమెను స్వాగతించారు. సభ్యులు వాసంశెట్టి వెంకటేశ్వరరావు, త్రినాథరావు, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

అన్నపూర్ణగా శారదామాత

పెందుర్తి: చినముషిడివాడ శారదా పీఠం అధిష్ఠాన దేవత శారదా రాజస్వరూప రాజశ్యామల అమ్మవారు శుక్రవారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దరనమిచ్చారు. అయ్యప్పస్వామి ఆలయం ప్రాంగణంలో దుర్గమ్మను, శ్రమశక్తినగర్ గాయత్రి మాతను లలితా త్రిపుర సుందరిగా, సప్తగిరినగర్ అలివేలు మంగాదేవిని సంతాన లక్ష్మి అలంకరించారు. ఎస్ఆర్‌పురంలో ధర్మకర్త కాయితి ఎర్రిబాబు అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు.

తుంగ్లాంలో రూ.10 లక్షలతో..

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం రామాలయం వద్ద నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో శుక్రవారం అమ్మవారిని రూ.పది లక్షల నోట్లతో అలంకరించారు. మహాలక్ష్మి అమ్మవారి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భవాని భక్తులు దర్శించుకున్నారు. అక్కిరెడ్డిపాలెంలో నవ్యాంధ్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తపాలెంలో..

గోపాలపట్నం: కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, చంద్రనగర్, పాతగోపాలపట్నం, వెంకటాపురంలో నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మహిళలు, భవానీ మాలదారులు పూజల్లో పాల్గొన్నారు. కొత్తపాలెం ఫైవ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25 అడుగుల దుర్గాదేవి విగ్రహాన్ని రూ.2లక్షలతో మహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు.

నాయుడుతోటలో...

వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్: నాయుడుతోట కృష్ణానగర్ దుర్గా మల్లేశ్వరాలయంలో శుక్రవారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నాయుడుతోట రవినగర్ వెంకటేశ్వరాలయంలో రోజుకు 12 సార్లు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్నారు. వేపగుంట ముత్యాలమ్మ, అప్పన్నపాలెం భూలోకమాంబ ఆలయంలో వేడుకలు జరుగుతున్నాయి. బుచ్చిరాజుపాలెం పైడిమాంబ, దుర్గాలమ్మ, బంగారమ్మ లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ దుర్గాదేవి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు చేశారు.



దుర్గాకాలనీలో 50 లక్షలతో దుర్గాదేవికి అలంకరణ



కుంకుమ పూజల్లో పాల్గొన్న ప్రొఫెసర్ లావణ్యదేవి





పెందుర్తిలో బాల త్రిపురసుందరి, శ్రీనివాసనగర్‌లో...

పరకామణిలో చోరీ చేసిన వారిని అరెస్టు చేయాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రసాదుల శ్రీనివాసరావు, తదితరులు

గాజువాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల పరకామణిలో చోరికి పాల్పడిన వైసీపీ దొంగలపై ఉక్కుపాదం మోపాలని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పరకారమణి చోరీపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ దొంగ ముఠా పథకం ప్రకారం తిరుమలలో అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. పరకామణి చోరీపై సమగ్ర విచారణ జరిపి దొంగలను కఠినంగా శిక్షించాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, లక్ష్మణరావు, గోమాడ వాసు, కొండబాబు, గాంధీ, అంజిబాబు, దేవుడు, శ్రీనివాసరావు, అప్పలరాజు, రాజారావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు పంపిణీచేస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

అగనంపూడి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడే సుశీల గజేంద్రరావు ఆర్థిక సాయంతో నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంత గ్రామాల్లో గల పలు పేద కుటుంబాలకు శుక్రవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కొలిపాక అప్పారావు, మరా మస్తాన్‌రావు, శీరంశెట్టి గోవిందరావు, నరిసింగరావు, లక్కరాజు రాము తదితరులు పాల్గొన్నారు.

ద్రోణంరాజు మనవడు రవి కిరణ్ మృతి



కిరణ్ (ఫైల్)

పెందుర్తి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దివంగత రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ మనవడు రవి కిరణ్ (43) గుండెపోటుతో చినముషిడివాడలోని స్వగృహంలో శుక్రవారం కన్నుమూశారు. ద్రోణంరాజు రెండో కుమార్తె కుమారుడైన రవికిరణ్ వైసీపీ కార్యకర్త. మాజీ ఎమ్మెల్యేలు గుడివాడ అమర్‌నాథ్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ రవికిరణ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

హత్యాయత్నం కేసులో ముద్దాయికి ఆరేళ్ల జైలు



ముద్దాయి నూకరాజు

గాజువాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ముద్దాయి ములకపల్లి వెంకట నూకరాజు (50)కు ఆరు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.కవిత శుక్రవారం తీర్పు చెప్పారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పెదగంట్యాడ దుర్గవానిపాలేనికి చెందిన గంట్యాడ శివపై అదే ప్రాంతానికి చెందిన వరుసకు బావమరి ది అయిన ములకలపల్లి వెంకటనూకరాజు 2022 ఏప్రిల్‌లో కత్తితో దాడిచేసి, హత్యకు యత్నించాడు. తప్పించుకున్న శివ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

సిరిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో మంజూరుకాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మెస్ చార్జీల భారంతో చదువులు సవ్యంగా సాగడం లేదన్నారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్, వెంకటేష్, ఆర్.నితిన్, ప్రసాద్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట కూడలిలో చిరు వ్యాపారుల నిరసన



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వేపగుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేపగుంట, నాయుడుతోట పరిధిలోని చిల్లర వర్తకులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం వేపగుంట కూడలిలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, దసరా వరకు వ్యాపారాలు చేసుకునేలా అనుమతించాలన్నారు. పెందుర్తి ఎస్ఐ దేముడునాయుడు, ఏఐటీయూసీ నేతలు వై.శ్రీనివాస్, రాంబాబు, రాజు, ఈశ్వరరావు, ప్రదీప్, శ్రీను, బుజ్జి, చిల్లర వర్తకులు పాల్గొన్నారు.

రైల్వే భూసేకరణ కాంపిటేటివ్ అథారిటీగా ఆర్డీవో

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింహాచలం నార్త్, గోపాలపట్నం మధ్య రైల్వేలైన్‌ల విస్తరణకు అవసరమైన భూ సేకరణకు కాంపిటేటివ్ అథారిటీగా విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీలేఖను నియమించారు. సింహాచలం నార్త్, గోపాలపట్నం మధ్య 2.64 కి.మీ. పొడవుజా ప్రస్తుతం ఉన్న రెండు లైన్లకు అదనంగా మూడు, నాలుగు లైన్లు వేస్తారు. ఈ మేరకు భూములు సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. ఇబ్బందులపై రైతులు, నివాసితులు తమ అభ్యంతరాలను ఆర్డీవోకు నివేదించవచ్చు.

పినగాడి జంక్షన్‌లో రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతుల అనంతరం పినగాడి జంక్షన్ వద్ద టీడీపీ నేతలు

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేపగుంట నుంచి కె.కోటపాడు వైపు వెళ్లే రోడ్డులో పినగాడి జంక్షన్ వద్ద శిథిలమైన గోతులను శుక్రవారం టీడీపీ నేతలు క్రషర్ బుగ్గి తీసుకువచ్చి మరమ్మతులు చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పినగాడి జంక్షన్‌లో అన్ని వైపులా వర్షపునీటి కాలువలు మూసివేశారు. దీనికితోడు వేపగుంట నుంచి కె.కోటపాడు రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఇటీవలి వర్షాలకు పినగాడి జంక్షన్‌లో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి ఎదురయింది. మొగలిపురం నుంచి నగరానికి వస్తున్న టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జి ఈ గోతుఉ చూసి వాహనం నిలిపి మరమ్మతులు చేయాలని పార్టీనాయకులకు సూచించారు. ఈ మేరకు గండి దేముడు, ఎంపీటీసీ సభ్యుడు తమరాన బంగారునాయుడు తదితరులు గోతులను తాత్కాలికంగా క్రషర్ బుగ్గితో కప్పేశారు. జేసీబీ సాయంతో పరిసరాల్లో నిలిచిన వర్షం నీరు పోయేలా మార్గం ఏర్పాటు చేశారు.